జనం కోసం - మన అక్షరం

# అక్షర వెలుగు

TELTEL02057

www.aksharavelugu.com

తెలుగు దిన పత్రిక

గురు వారం | 17.03.22 | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : పృధ్వీరాజు. జి | సంపుటి - 01, సంచిక-27 | పేజీలు - 4 | వెల రూ. 5

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak




ఏ.సి.బి. టోల్ ఫ్రీ నెంబర్ - 1064 -104

Anti-Corruption Bureau, Telangana State
అవినీతి నిరోధక శాఖ, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యాలయం
రోడ్ నెంబర్ 12, బంజారా హిల్స్, హైదరాబాద్ - 500 034
ఫోన్ నెంబర్ : 040-23251555, 9440446126
ఈ-మెయిల్ : dg_acb@telangana.gov.in

# దేశంలో ఫోర్త్ వేవ్ కరోనా హెచ్చరికలు

## ఖరగ్‌పూర్ ఐఐటి శాస్త్రవేత్తల అంచనా



**జెనీవా, మార్చి 16 (అక్షర వెలుగు):** చైనాలో మళ్లీ కరోనా కేసులు పెరుగుతుండడంతో ప్రపంచం మరోసారి ఉలిక్కి పడింది. 2020 మార్చి తర్వాత రికార్డు స్థాయిలో రోజువారీ కేసులు నమోదవుతున్నాయి. వివిధ నగరాల్లో పాజిటివ్ కేసులు పెరగడంతో కఠిన ఆంక్షలతో పాటు లాక్‌డౌన్ విధించారు. సోమవారం ఒక్కరోజే 2,300 కేసులు నమోదు అయ్యాయి. ఒక రోజు ముందు 3,400 కేసులు నమోదయ్యాయి. చైనాలో గడిచిన రెండేళ్లలో రోజువారీ కేసుల్లో ఇదే అత్యధికం కావడం గమనార్హం. చైనాలో పెరుగుతోన్న ఈ కేసుల సంఖ్య మరోసారి భారత్‌కు కరోనా ముప్పు తప్పదా అన్ని ప్రశ్నలు తలెత్తేలా చేస్తున్నాయి. భారత్‌లో నాలుగో వేవ్ కచ్చితంగా ఉంటుందని వాదనలు తెరపైకి వస్తున్నాయి. ఈసారి కరోనా ప్రభావం ఏకంగా 75 శాతం మందిపై పడొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. భారత్‌లో కరోనా వేరియంట్‌తో మూడో వేవ్ వచ్చింది. ఇప్పటికీ ఆ వేరియంట్ ఆనవాళ్లు ఉండడంతో నాలుగో వేవ్‌కు అవకాశం ఉందని కోవిడ్ 19 టాస్క్ గ్రూప్‌ను లీడ్ చేస్తున్న డాక్టర్ ఎన్‌కే అరోరా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఐఐటీ ఖరగ్‌పూర్ చేసిన అధ్యయనాల్లోనూ భారత్‌లో ఫోర్త్ వేవ్ తప్పదని హెచ్చరికలు జారీ చేశారు. ఐఐటీ ఖరగ్‌పూర్ అంచనాల మేరకు జూలైలో నాలుగో దశ ప్రభావం మొదలువుతుందని తెలిపారు. ఇదిలా ఉంటే రెండుడోస్‌ల వ్యాక్సిన్, సీనియర్ సిటిజన్స్‌కి బూస్టర్ డోస్ కారణంగా కొవిడ్ మరణాలను భారత్ అదిగమించదని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. మరణాల విషయంలో నాలుగోవేవ్ ప్రభావాన్ని మాత్రం ఇప్పుడే అంచనా వేయలేమని చెబుతున్నారు. ఇక దేశంలో 12 నుంచి 14 మధ్య టీనేజర్స్‌కి కూడా వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో ఫోర్త్ వేవ్‌పై పెద్దగా ఆందోళన అవసరం లేదని ఎన్‌కే అరోరా అభిప్రాయపడుతున్నారు.

> కరోనాప్రభావం పూర్తిగా తగ్గిపోయిందని.. ఇకపై స్వేచ్ఛగా జీవించవచ్చని అంతా భావిస్తున్న తరుణంలో మళ్లీ ఫోర్త్‌వేవ్ అంటూ హెచ్చరికలు గందరగోళంలో పడేశాయి. ప్రపంచ దేశాలను ఆర్థికంగా, ఆరోగ్యంగా తీవ్ర దెబ్బ తీసిన కరోనా థార్డ్ వేవ్ త్వరగా ముగిసింది.. ఇకపై మరో వేవ్ రాదని అంతా సంతోషించే లోపే మరోసారి కరోనా వార్తలు కలవరపెడుతున్నాయి.



## ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లతో ట్రాఫిక్‌కు చెక్

- హైదరాబాద్‌లో ట్రాఫిక్ నిర్మూలనకు చర్యలు
- బైరామల్ గగూడ ఫ్లై ఓవర్ ప్రారంభంలో మంత్రి కెటిఆర్

**హైదరాబాద్, మార్చి 16 (అక్షర వెలుగు):** ఫ్లైఓవర్లు, రహదారుల నిర్మాణంతో నగరంలో ట్రాఫిక్ ఫ్రీ జోన్ చేయాలన్నదే లక్ష్యమని మంత్రి కెటిఆర్ అన్నారు. రద్దీ కూడళ్లలో ఫ్లై ఓవర్ల నిర్మాణం వేగంగా సాగుతోందన్నారు. గతంలో ఎప్పుడూ ఇంతగా ఫ్లై ఓవర్ల నిర్మణం జరగలేదన్నారు. హైదరాబాద్ నగరంలో స్ట్రాటజిక్ రోడ్ డెవలప్‌మెంట్ ప్రొగ్రాం (ఎస్ఆర్‌డీపీ)లో (మిగతా 3వ పేజీలో)

## తెలంగాణ టెన్త్, ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

- మే 23 నుంచి పదో తరగతి పరీక్షల తేదీలు ఖరారు
- ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్ష
- ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు మే 6 నుంచి 23 వరకు నిర్వహణ
- సెకండియర్ పరీక్షలు 7నుంచి 24 వరకు షెడ్యూల్

**హైదరాబాద్, మార్చి 16 (అక్షర వెలుగు):** తెలంగాణ పదో తరగతి, ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. రాష్ట్ర వ్యాప్తంగా మే 23వ తేదీ నుంచి టెన్త్ ఎగ్జామ్స్ ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ బుధవారం షెడ్యూల్‌ను విడుదల చేసింది. టెన్త్ పరీక్షలు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు పరీక్షలను నిర్వహించనున్నారు. అలాగే తెలంగాణ ఇంటర్ కొత్త షెడ్యూల్ వచ్చేసింది. తెలంగాణ వ్యాప్తంగా మే 6వ తేదీ నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు సవరించిన పరీక్షల షెడ్యూల్‌ను రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు బుధవారం విడుదల చేసింది. ఫస్టియర్ పరీక్షలు 6 నుంచి మే 23వ తేదీ వరకు, సెకండియర్ పరీక్షలు 7 నుంచి 24 వరకు కొనసాగ నున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలను నిర్వహించనున్నారు. ఇక ప్రాక్టికల్ (మిగతా 2వ పేజీలో)

## మత విద్వేషాలు రెచ్చగొడుతున్న ఫేస్‌బుక్

### లోక్‌సభ జీరో అవర్‌లో ప్రస్తావించిన సోనియా



**న్యూఢిల్లీ, మార్చి 16 (అక్షర వెలుగు):** సోషల్ మీడియా అన్ని రాజకీయ పార్టీలను సమానంగా చూడటం లేదని కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ అన్నారు. ఫేస్‌బుక్ మత విద్వేషాలు రెచ్చగొడుతోందని తెలిపారు. బుధవారం ఆమె లోక్‌సభ జీరోఅవర్‌లో మాట్లాడుతూ.. భారత రాజకీయాలు, ఎన్నికల్లో ఫేస్‌బుక్, ఇతర సోషల్ మీడియా మాధ్యమాల జోక్యాన్ని తగ్గించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అల్ జజీరా, ది రిపోర్టర్స్ కలెక్టివ్‌లో ప్రచురించిన రిపోర్టును సోనియా గాంధీ ప్రస్తావిస్తూ.. ఇతర రాజకీయ పార్టీలతో పోల్చితే ఫేస్‌బుక్ ఎన్నికల ప్రకటనల కోసం బీజేపీకి మాత్రమే తక్కువ ధరలో డీల్ ఆఫర్ చేసిందని పేర్కొన్నారు. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం స్పందిస్తూ.. ప్రపంచంలోనే అత్యంత పెద్ద రాజ్యాంగంలోని ఎన్నికల వ్యవస్థలో సోషల్ మీడియా జోక్యాన్ని క్రమంగా తగ్గించాలని కోరారు. సోషల్ మీడియం జోక్యాన్ని పక్షపాత రాజకీయాలకు అతీతంగా తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఏ పార్టీ ఆధికారంలో ఉన్నా.. బాధ్యతగా మనమంతా భారత ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని గుర్తుచేశారు.

## బోయింగ్‌కు విమాన విడిభాగాల సరఫరా

### వెల్లడించిన ఆజాద్ ఇంజినీరింగ్ కంపెనీ




**హైదరాబాద్, మార్చి 16 (అక్షర వెలుగు):** హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఆజాద్ ఇంజినీరింగ్ ప్రయివేటు లిమిటెడ్ కంపెనీ విమానాల విడి భాగాలను బోయింగ్ సంస్థకు విజయవంతంగా అందించింది. విమానాల విడి భాగాల మొదటి కన్‌సైన్‌మెంట్‌ను బోయింగ్ సంస్థకు సకాలంలో అందించినట్లు ఆజాద్ (మిగతా 3వ పేజీలో)

## సమ్మక్క-సారలమ్మపై చినజీయర్ వ్యాఖ్యలు

### మండిపడ్డ ములుగు ఎమ్మెల్యే సీతక్క



**హైదరాబాద్, మార్చి 16 (అక్షర వెలుగు):** సమ్మక్క-సారలమ్మలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన చిన్నజీయర్ స్వామిపై ములుగు ఎమ్మెల్యే సీతక్క మండిపడ్డారు. బుధవారం ఆమె ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ చిన్నజీయర్ తెలంగాణ ఆత్మగౌరవ పోరాట ప్రతీకలైన సమ్మక్క సారలమ్మ మీద ఎందుకు అహంకారపూరితమైన వ్యాఖ్యలు చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మా (మిగతా 3వ పేజీలో)

## ఆదివాసి కోయ, గొత్తి కోయలపై ఫారెస్టు అధికారుల జులూమ్

### మణుగూరు డివిజన్ ఫారెస్ట్ అధికారి ఇంచార్జీ ఎఫ్‌డిఓ బెదిరింపులు తగవు : తుడుందెబ్బ అల్లెం కోటి



> మణుగూరు సబెడివిజన్ ఏరియాలోని ప్రాంతాలు పినపాక మండలంలోని మల్లారం, తిర్లపురం తదితర ఆదివాసీ గ్రామాలపై దాడులు చేస్తూ జెసిబిలు తీసుకుపోయి అధికార బలంతో తప్పుడు కేసులు బనాయిస్తూ ఏజెన్సీలో భయానక వాతావరణం సృష్టిస్తున్నారని ఆదివాసీలు ఆగ్రహిస్తున్నారు.

**భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 16 (అక్షర వెలుగు):** మణుగూరు సబ్ డివిజన్ ఏరియాలోని ప్రాంతాలు పినపాక మండలంలోని మల్లారం, తిర్లపురం తదితర ఆదివాసీ గ్రామాలపై దాడులు చేస్తూ జెసిబి లు తీసుకుపోయి అధికార బలంతో తప్పుడు కేసులు నమోదు చేస్తూ ఏజెన్సీలో భయానక వాతావరణ సృష్టిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఆదివాసీలకు పోడు భూమి సమస్యలు పరిష్కరిస్తామని గతంలో చెప్పారని కాని తీసుకున్న దరఖాస్తుల పరిష్కారం ఇప్పటివరకు కాలేదని అల్లెం కోటి అన్నారు. ప్రస్తుతం మణుగూరు ఇంచార్జీ ఎఫ్ డి ఓ మంజుల ఆదివాసీ గూడంలపై వారి భూములపై దాడులు చేస్తూ ఆదివాసీల భూముల్ని బలవంతంగా లాగి ప్లాంటేషన్ వేయుటకు తీవ్ర ప్రయత్నాలు కొనసాగిస్తున్నారని ఆరోపించారు.

> ఇంఛార్జ్ ఎఫ్ డి ఓ వాస్తవాలు తెలుసుకోకుండా ఆదివాసీ తెగల మధ్య చిచ్చురేపుతూ పోడు భూములను బలవంతంగా గుంజు కోవాలని ప్రయత్నిస్తే తీవ్రపరిణామాలు, ఉద్య మాలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

ఇట్టి విషయాన్ని ఆదివాసీ నాయకులు ప్రశ్నిస్తే వారిపై కూడా కేసులు బనాయిస్తామని బెదిరిస్తున్నారు. ఇది ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. గౌరవ న్యాయస్థానాన్ని ఆశ్రయించి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఇంచార్జ్ ఎఫ్ డి ఓ కనీసం ఏజెన్సీ చట్టాలు, ఏజెన్సీ ప్రాంతాలపై మీకు అవగాహన లేకుండా వ్యవహరిస్తూ ఏజెన్సీ అలవెన్సులు తీసుకుంటూ అటవీ హక్కుల చట్టాన్ని తుంగలో తొక్కుతూ గ్రామ సభ తీర్మానాలు లేకుండా ఎఫ్ఆర్‌సి కమిటీ తీర్మానాలు లేకుండా బలవంతంగా పోడు సాగుదారులను ఎలా గెంటివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 5వ షెడ్యూల్ పరిపాలకులు, గిరిజనులకు ఇంత దారుణాలు ఏజెన్సీ ప్రాంతాలలో జరుగుతుంటే పీవో ఐటిడిఎ ఎక్కడున్నారని ప్రశ్నించారు. లంబాడి వలసలు, గిరిజనేతర వలసలు చట్ట విరుద్ధంగా వారు చేసే పోడు సాగు ఇంచార్జి ఎఫ్ డి ఓకి పట్టవు గాని కోయ, గొత్తికోయ పోడు భూములల్లో తెగల మధ్య చిచ్చు పెడుతూ గొత్తి కోయలు మైగ్రేషన్ అనే హక్కు మీకుందా ?, మీ సొంత డిపార్ట్‌మెంట్‌లో ఎంత మంది దొంగ ఏజెన్సీ సర్టిఫికెట్‌తో ఉద్యోగాలు పొందినారో వాటిని బయటకు తీయలని సవాల్ చేశారు. జల్,జమీన్ జంగిల్, జమిన్ కోసం కొమరంభీమ్ ఆశయాలతో అటవీ హక్కుల కోసం, 5వ షెడ్యూల్ చట్టాల అమలు కోసం ఆదివాసీ నాయకులు, భావ స్వారూప్యమున్న పార్టీలను, ప్రజా సంఘాలను కలుపుకొని మా హక్కుల కోసం పోరాడతామని ఈ సందర్భంగా తెలియజేశారు.

## కెసిఆర్ మాటల వెనక అన్నీ మోసాలే



**హైదరాబాద్, మార్చి 16 (అక్షర వెలుగు):** రాజ్యాంగంపై కేసీఆర్ వ్యాఖ్యలు వింటుంటే లెనిన్ మాటలు గుర్తొస్తున్నాయని ఎమ్మార్పీఎస్ నాయకుడు మందకృష్ణ మాదిగ అన్నారు. 'ఏ నినాదం వెనుక ఎవరి ప్రయోజనాలు దాగున్నాయో తెలుసుకోలేనంత కాలం ప్రజలు మోసపోతూనే ఉంటారు.' అన్న లెనిన్ మాటలను ఆయన పరోక్షంగా గుర్తు చేశారు. రాజ్యాంగంపై కేసీఆర్ మాట్లాడిన తీరును అర్థం చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్యనీ, స్వేచ్ఛకు కేసీఆర్ వ్యతిరేకమని ఆయన ఆరోపించారు. కేసీఆర్ రాజులా భావిస్తూ రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తున్నారన్నారు. ఉద్దేశపూర్వకంగానే కేసీఆర్ అంబేద్కర్‌ను అవమానిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

## హిజాబ్ కర్నాటక తీర్పుపై సుప్రీంలో పిటిషన్

### హోలీ సెలవుల తరవాత విచారిస్తామన్న చీఫ్ జస్టిస్

**న్యూఢిల్లీ, మార్చి 16 (అక్షర వెలుగు):** హిజాబ్ వివాదంపై కర్ణాటక హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ వేసిన పిటిషన్‌పై విచారణను హోలీ సెలవుల తర్వాత సుప్రీంకోర్టు చేపట్టనుంది. ఈ కేసుపై తక్షణ విచారణ జరపాలని సీనియర్ అడ్వకేట్ సంజయ్ హెగ్డే విజ్ఞప్తి చేయగా, హోలీ సెలవుల తర్వాత లిస్టింగ్ చేద్దాం..అని భారత ప్రధాన న్యాయవాది ఎన్‌వీ రమణ ఆయనకు తెలియజేశారు. హోలీ సందర్భంగా 17వ తేదీ గురువారం నుంచి మూడు రోజుల పాటు కోర్టుకు సెలవులు. 21న తిరిగి తెరుస్తారు. కాగా, కర్ణాటక విద్యా సంస్థల్లో హిజాబ్ ధరించడంపై రాష్ట్ర ప్రభుత్వం విధించిన నిషేధాన్ని హైకోర్టు మంగళ వారం నాడు సమర్థించింది. దీన్ని సవాలు చేస్తూ వేసిన పిటిషన్లను కొట్టివేసింది. హైకోర్టు తీర్పు చెప్పిన కొద్ది గంటలకే కర్ణాటక ముస్లిం విద్యార్థిని నిబా నాజ్ సుప్రీంకోర్టును ఆశ్రయి ంచారు. హైకోర్టు తీర్పును

## లఖింపూర్ ఖేరీ కేసులో సాక్షులకు రక్షణ

### యూపిప్రభుత్వాన్ని ఆదేశించిన సుప్రీం



**న్యూఢిల్లీ, మార్చి 16 (అక్షర వెలుగు):** లఖింపూర్ ఖేరీ కేసులో సాక్షులకు రక్షణ కల్పించాలని ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు బుధవారం ఆదేశించింది. ఓ ప్రధాన సాక్షిపై దాడి జరిగినట్లు పిటిషనర్లు చెప్పడంతో ఈ ఆదేశాలను జారీ చేసింది. హోలీ తరవాత దీనిపై విచారిస్తామని పేర్కొంది. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఆశిష్ మిశ్రాకు బెయిలు మంజూరు చేయడాన్ని పిటిషనర్లు సవాల్ చేశారు. 2021 అక్టోబరులో ఉత్తర ప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరీలో నిరసన తెలుపుతున్న రైతులపై నుంచి ఓ కారు దూసుకెళ్ళింది. ఈ కారు కేంద్ర మంత్రి అజయ్ మిశ్రా కుమారుడు ఆశిష్ మిశ్రాకు చెందినదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ దుర్ఘటనలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో నలుగురు రైతులు ఉన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన ఆశిష్ మిశ్రాకు బెయిలు మంజూరు చేసి, విడుదల చేయడాన్ని ముగ్గురు రైతుల కుటుంబ సభ్యులు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. అలహాబాద్ హైకోర్టు ఫిబ్రవరి (మిగతా 3వ పేజీలో)

## సంపాదకీయం

# ప్రాంతీయ పార్టీల్లో ఐక్యత సాధ్యమేనా

### యూపి ఎన్నికల నుంచి గుణపాఠం నేర్చుకునేనా

### మోడీ అమిత్‌షాల ఊహాలను పసిగట్టగలరా

అయిదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత ప్రతిపక్షాలు మోదీని ఎదుర్కొనే విషయంలో వెనక్కి తగ్గుతాయనే భావించాలి. మునుపటి దూకుడును ప్రదర్శించకపోవచ్చు. ఎందుకంటే కాంగ్రెస్ పునాదులతో పెకిలించి కూలబడుతోంది. కాంగ్రెస్‌ను నామరూపాలు లేకుండా చేస్తున్న బిజెపి ప్రాంతీయ పార్టీలను నిర్మూలించడంపై ఎప్పుడో దృష్టి సారించింది. తమ అస్తిత్వం కాపాడుకోవడానికై కెసిఆర్ ఇప్పటికే పోరాటం చేపట్టారు.ప్రాంతీయ పార్టీలు తమ ప్రయోజనాలను కాపాడుకోవడానికైనా కలిసికట్టుగా వస్తాయన్న భావన లేదు. ఈ ఏడాది గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ లలోనూ, వచ్చే ఏడాది మధ్యప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోనూ ఎన్నికలు జరుగనున్నాయి. బిజెపి దూకుడును అడ్డుకోవాలంటే ముందుగా ఆ పార్టీ ప్రత్యర్థులు తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రజలపై,పాలనపై దృష్టి కేంద్రీకరించాలి. బిజెపిని ఎదుర్కోవడానికి వాటికి సమిష్టి పోరాటం అవసరం. యూపి అనుభవం నుంచి ఆయా ప్రాంతీయ పార్టీలు పాఠాలు నేర్చుకోవాలి. గత ఎనిమిది సంవత్సరాల్లో తరచూ వస్తోన్న ఎన్నికల్లో బిజెపి విజయం సాధించడం చిన్న విషయం కాదు. మళ్లీ మళ్లీ బిజెపికి ఓటు ఎందుకులే అన్న నిరాసక్తత జనంలో రాకుండా బిజెపి చూసుకుంటోంది. ఓటింగ్‌కు వెళ్లాలి, బిజెపిని గెలిపించాలి అన్న ఒకరకమైన భావనను బిజెపి బలంగా ప్రచారం చేస్తోంది. కేవలం సామాజిక సమీకరణాలే కాకుండా, క్షేత్ర స్థాయి నుంచి పనిచేసే బలమైన సంస్థాగత శక్తిని బిజెపి పటిష్టం చేసుకుంటూ పోతోంది. గోరంత అభివృద్ధిని కొండంతగా.. గోరంత పనులను కొండంతగా భూతద్దంలో చూపే ప్రయత్నాలు నిరంతరం సాగుతున్నాయి. రకరకాల కులసమీకరణలు చేశారు. అక్కడితో ఆగకుండా బిజెపి శిబిరంలో ఉన్న స్వామిప్రసాద్ మౌర్య, దారాసింగ్ చౌహాన్ లాంటి వారికి వల వేశారు. యాదవేతర బీసీల్లో కుర్మీలకు అధిక సీట్లు ఇచ్చారు. ఈ క్రమంలో ఇప్పుడు అకిలేశ్ గెలిచిన వారిలో ఎంతమంది ఆయన వెంట ఉంటారన్నది కూడా అనుమానమే. ఎంతమంది బిజెపి మందలో దూకుతారో కూడా చెప్పడం కష్టమేమీ కాదు. నరేంద్రమోదీ, అమిత్‌షాలు ఎన్నికల వ్యూహంలో దిట్టలు. యూపీ ఎన్నికల ఫలితాలు ప్రకటించి 24 గంటలు కాకముందే నరేంద్రమోదీ గుజరాత్‌కు వెళ్లి రెండు రోజులు అక్కడే గడిపారు. అహ్మదాబాద్‌లో రోడ్ షోలో పాల్గొన్నారు. ఇవన్నీ డిసెంబర్‌లో గుజరాత్‌లో జరిగే ఎన్నికలకు నాందీ ప్రస్తావనలుగా భావించాలి.

ఎడిటర్

# సోనియా నాయకత్వాన్ని బలపరచిన సిఎల్‌పి

- కష్టకాలంలో పార్టీని ముందుకు నడిపించిన నేత
- మర్రి శశిధర్ రెడ్డి నివాసంలో జరిగిన సమావేశంపై భట్టి వివరణ



**హైదరాబాద్, మార్చి 16 (అక్షర వెలుగు):** కాంగ్రెస్ అధ్యక్షురాలు నిర్ణయాన్ని తామంతా సమర్థిస్తున్నామని, ఈమేరకు సిఎల్‌పి తీర్మానించిందని సిఎల్పి నేత భట్టి విక్రమార్క తెలిపారు. ఈ తీర్మానాన్ని కాంగ్రెస్ పార్టీకి అందచేస్తామని అన్నారు. ఢిల్లీకి కాంగ్రెస్ నాయకులు ఎవరైనా వెళ్ళవచ్చని, వెళతామని చెప్పవచ్చని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. పార్టీ సీనియర్ నేత మర్రి శశిధర్ రెడ్డి ఇంట్లో జరిగిన సమావేశంపై ఆయన వివరణ ఇచ్చారు. సీఎల్పీ సమావేశంలో సోనియా గాంధీ నాయకత్వాన్ని బలపరిచామన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వం కాంగ్రెస్ పార్టీకి చాలా అవసరం అని చర్చించామని అన్నారు. దేశంలో అనేక రకాల విధ్వంస చర్యలు, మతపరమైన హింసలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. దేశాన్ని కాపాడాలంటే పార్టీ పగ్గాలు చేపట్టాలని రాహుల్‌ను కోరామన్నారు. దానికి అనుగుణంగా తాము రెజల్యూషన్ పాస్ చేస్తున్నామని ఆయన తెలిపారు. ఏ పదవులు ఆశించకుండా రాహుల్ ఇంతకాలం పనిచేశారన్నారు. పార్టీ నిర్మాణం కోసం మళ్లీ రాహుల్ పగ్గాలు చేపట్టాలని కోరుతున్నామన్నారు. కపిల్ సిబాల్ వంటి నాయకులు మేధావులుగా పని చేసినప్పటికీ, గాంధీ కుటుంబమే దేశాన్ని కాపాడిందని ఆయన పేర్కొన్నారు. గాంధీ కుటుంబం కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడం వల్లే వాళ్ళు కేంద్ర మంత్రులయ్యారన్నారు. మర్రి శశిధర్ రెడ్డి ఇంట్లో జరిగిన సమావేశంలో కూడా ఇదే అంశంపై చర్చించామన్నారు. దేశానికి గాంధీ కుటుంబమే శ్రీరామరక్ష అని భావిస్తున్నామని అన్నారు. పీసీసీ చీఫ్ రేవంత్‌పై వీహెచ్ వ్యతిరేకంగా మాట్లాడిన విషయం తనకు తెలీదని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణాలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందన్నారు. 2023-24లో రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# తెలంగాణ టెన్త్, ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

(మొదటి పేజీ తరువాయి..)ఎగ్జామ్స్ మార్చి 23 నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు బోర్డు అధికారులు వెల్లడించారు. జెఇఇ పరీక్షల షెడ్యూల్ మారడంతో తెలంగాణ ఇంటర్ బోర్డు పరీక్షలకు కొత్త తేదీలను ప్రకటించింది. మే 6 నుంచి మే 24 వరకు ఇంటర్ ఎగ్జామ్స్ జరుగుతాయని వెల్లడించింది. మే 6, 9, 11, 13, 16, 18, 20, 23 తేదీల్లో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు జరగనుండగా.. మే 7, 10, 13, 14, 17, 19, 21, 24 తేదీల్లో ఇంటర్ సెకండియర్ పరీక్షలు జరుగుతాయని స్పష్టం చేసింది. జేఈఈ పరీక్షలు రాసే విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా.. ఇంటర్ పరీక్షల షెడ్యూల్ రెండోసారి మారడం గమనార్హం. ఇదిలా ఉంటే.. ఎన్విరాన్‌మెంటల్ పరీక్ష ఏప్రిల్ 11, 12 తేదీల్లో జరగనుండగా ప్రాక్టికల్ ఎగ్జామ్స్ మార్చి 23 నుంచి ఏప్రిల్ 8 వరకు నిర్వహించనున్నారు. మరోవైపు ఏఇఇ మెయిన్ పరీక్షల తేదీలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ రీ-షెడ్యూల్ చేసింది. గతంలో విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 16 నుంచి 21 మధ్య జెఇఇ జరగాల్సి ఉంది. కానీ కొత్త షెడ్యూల్ ప్రకారం జేఈఈ మెయిన్ పరీక్షలు ఏప్రిల్ 21, 24, 25, 29, మే 1, మే 4 తేదీల్లో జరగనున్నాయి. కాగా, తెలంగాణ ఇంటర్ పరీక్షల షెడ్యూల్‌లో మార్పు జరగడంతో పదో తరగతి పరీక్షల తేదీలు కూడా మారింది. మే 23 నుంచి 28 వరకు టెన్త్ క్లాస్ పరీక్షలు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు.

# ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లతో ట్రాఫిక్‌కు చెక్

(మొదటి పేజీ తరువాయి..) మరో రెండు కీలక ప్రాజెక్టులు అందుబాటులోకి వచ్చాయి. ఎల్‌బీనగర్ చౌరస్తాలో ఇన్నర్‌రింగ్‌రోడ్డు మార్గంలో రూ.9.28 కోట్లతో నిర్మించిన అండర్‌పాస్ , రూ. 28.642 కోట్లతో బైరామల్‌గూడ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లై ఓవర్‌ను రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖల మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఎల్బీనగర్ పర్యటనలో భాగంగా నాగోల్, బండ్లగూడలో నాలా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీతో పాటు ఎల్బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. వర్షాలు, వరదల వల్ల ఎల్బీనగర్‌లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని తెలిపారు. రూ. 2,500 కోట్లతో ఎల్బీనగర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టామని పేర్కొన్నారు. ఈ క్రమంలో వరద ముంపు నివారణకు రూ. వెయ్యి కోట్లతో నాలాల అభివృద్ధి పనులు చేపట్టామని పేర్కొన్నారు. ఎల్బీనగర్ పరిధిలో మంచి నీటి సమస్యను పరిష్కరించేందుకు 12 రిజర్వాయర్లు నిర్మించామన్నారు. 353 కిలోమీటర్ల మేర వాటర్ పైపులైన్‌లు వేశామన్నారు. ట్రాఫిక్ కష్టాలు తీర్చేందుకు ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌ల నిర్మాణం చేపట్టినట్లు స్పష్టం చేశారు. గడ్డి అన్నారం మార్కెట్ స్థలంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మిస్తామన్నారు. ఎల్బీనగర్‌లో భూ రిజిస్ట్రేషన్ సమస్య కూడా పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. కొత్త పెన్షన్లు 2 నుంచి 3 నెలల్లో అందజేస్తామని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

# లఖింపూర్ ఖేరీ కేసులో సాక్షులకు రక్షణ

(మొదటి పేజీ తరువాయి..)10న ఆశిష్‌కు బెయిలు మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం కోర్టుకు తగిన సహకారం అందించలేదని, ఆశిష్‌కు మంజూరైన బెయిలు చట్టం దృష్టిలో సమర్థనీయం కాదని పిటిషనర్లు వాదించారు. ఆశిష్‌పై చార్జిషీటును కోర్టుకు సమర్పించలేదని, దానిని కోర్టు పరిశీలించలేదని తెలిపారు. పిటిషనర్ల తరపున సీనియర్ అడ్వకేట్ దుష్యంత్ దవే, అడ్వకేట్ ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపించారు. ఆశిష్ మిశ్రాకు బెయిలు మంజూరైన తర్వాత ఓ ప్రధాన సాక్షిపై కిరాతకంగా దాడి జరిగిందని ప్రశాంత్ భూషణ్ సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్ళారు. బీజేపీ ప్రభుత్వం గెలిచిందని, నీ సంగతి చూస్తుందని బెదిరించారని చెప్పారు. దీనిపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ స్పందిస్తూ, మేడమ్, ఏమిటిది ఓ సాక్షిపై దాడి జరిగిందని వాళ్లు చెప్తున్నారు. మీరు సవివరమైన కౌంటర్ దాఖలు చేయాలి. సాక్షులకు రక్షణ కల్పించాలి. హోళీ తర్వాత వెంటనే దీనిని విచారిస్తాం అని ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వ న్యాయవాది రుచిర గోయల్‌కు చెప్పారు.

# కరోనా ఇంకా ప్రమాదం పొంచే ఉంది

- ప్రతి ఒక్కరూ వ్యాక్సిన్ వేసుకోవాల్సిందే
- పిల్లల వ్యాక్సినేషన్ ప్రారంభించిన మంత్రి హరీష్ రావు
- వ్యాక్సిన్ ఉత్పత్తిలో ఆదర్శంగా నిలిచిన హైదరాబాద్
- బాలల వ్యాక్సిన్ ఉత్పత్తి చేసిన బిఇని అభినందించిన మంత్రి



**హైదరాబాద్, మార్చి 16 (అక్షర వెలుగు):** : కరోనా ప్రభావం తగ్గిందే తప్ప వైరస్ ప్రమాదం ఇంకా పొంచి ఉందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. అందువల్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిందేనని అన్నారు. ప్రతి ఒక్కరూ వ్యాక్సిన్ తీసుకొని, ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలో 50 పడకల సీహెచ్‌సీ ఆస్పత్రి ప్రారంభంతో పాటు 12-14 ఏండ్ల లోపు పిల్లలకు వ్యాక్సినేషన్ పక్రియను మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ..నేషనల్ వ్యాక్సినేషన్ డే సందర్భంగా 12 నుంచి 14 ఏండ్ల లోపు పిల్లలకు వ్యాక్సినేషన్ అందించడం సంతోషంగా ఉందన్నారు. కరోనా అయిపోయిందని, ఇక లేదని అనుకోవడం పొరపాటన్నారు. కరోనా ప్రభావం తగ్గింది తప్ప వైరస్ ప్రమాదం ఇంకా పొంచి ఉందని అన్నారు. ఈ నేపథ్యంలో అందరూ జాగ్రత్తగా ఉండాలి. థర్డ్ వేవ్‌లో కరోనా ప్రభావం చూపలేదని, టీకా అవసరం లేదనే నిర్లక్ష్య ధోరణి పెట్టుకోవద్దు. చైనా, అమెరికా, హాంకాంగ్‌లో కొత్త కేసులు వస్తున్నాయని వింటున్నాం. డబ్ల్యూహెచ్‌వో కూడా అన్ని దేశాలను అప్రమత్తం చేస్తోందని ఈ క్రమంలో వ్యాక్సిన్‌ను ప్రతి ఒక్కరూ విధిగా వేసుకోవాలని హరీశ్‌రావు సూచించారు. ప్రపంచంలో కొత్త వ్యా క్సిన్ రావాలంటే హైదరాబాద్ వైపు చూస్తున్నారని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ప్రపంచానికే తెలంగాణ రాష్ట్రం వ్యాక్సిన్ హబ్‌గా మారిందని, కొత్త వ్యాక్సిన్ అభివృద్ధి చేయాలంటే ఇప్పుడు ప్రపంచం తెలంగాణ వైపు చూసే పరిస్థితి ఉందని ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. బుధవారం ఖైరతాబాద్ లో 50 పడకల సిహెచ్ సి ఆసుపత్రితో పాటు 12-14 ఏండ్ల మధ్య వయసున్న పిల్లలకు టీకాలు వేసే కార్యక్రమం మంత్రి హరీశ్ రావు ప్రారంబించారు. భారతదేశంలో కరోనా నివారణకు వచ్చిన మూడు వ్యాక్సిన్లలో రెండు హైదరాబాద్ నుంచి వచ్చినవేనని అందుకు గర్వకారణంగా ఉందన్నారు. భారత్ బయోటెక్ నుంచి వచ్చిన కొవాగ్జిన్, బయోలాజిక్ ఈ సంస్థ నుంచి వచ్చిన కొర్బెవాక్స్ అని తెలిపారు. ఈ రెండో వ్యాక్సిన్ కొర్బెవాక్స్ 12 నుంచి 14 ఏండ్ల లోపు పిల్లలకు వేస్తున్నారు. బయోలాజిక్ ఈ సంస్థ ఎండీ మహిమా దాట్లకు హరీశ్‌రావు శు భాకాంక్షలు తెలిపారు. ఆమె అద్భుతమైన విజయాలు సాధించారు. ఆమె మరింత ముందుకు వెళ్లాలని కోరుకుంటూ, ప్రభుత్వం భవిష్యత్‌లోనూ ఆమెకు సహాయ, సహకారాలు అందిస్తుందన్నారు. రాష్ట్రంలో ఫస్ట్ డోస్ వ్యాక్సినేషన్ 106 శాతం పూర్తి చేసుకున్నామని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. సెకండ్ డోస్ వ్యాక్సినేషన్ 97 శాతం పూర్తి చేసుకున్నాం. 15 -17 ఏండ్ల లోపు పిల్లలకు సంబంధించి 87 శాతం వ్యాక్సినేషన్ పక్రియ పూర్తయిందన్నారు. 12 -14 ఏండ్ల లోపు పిల్లలకు ఇవాళ ప్రారంభమైంది. వీరు మైనర్లు కాబట్టి.. తల్లిదండ్రులు చొరవ చూపి వ్యాక్సిన్ వేయించాలి. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలి. 17 లక్షల మంది పిల్లలు ఉంటారని అంచనా వేశారు. ప్రైమరీ హెల్త్ సెంటర్లు, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు, బస్తీ దవాఖానాల్లో వ్యాక్సినేషన్ కార్యక్రమం కొనసాగుతోందని తెలిపారు. 60 ఏండ్లు దాటిన వారందరికీ బూస్టర్ డోసు ఇవ్వాలని గతంలో కేంద్రానికి లేఖ రాశాం. ఇందుకు కేంద్రం అంగీకరించిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ రోజు నుంచి 60 ఏండ్లు దాటిన వారందరికీ బూస్టర్ డోసు ఇస్తామన్నారు. వ్యాక్సినేషన్ తీసుకున్న వారిలో వ్యాధి తీవ్రత తక్కువగా ఉంది. మరణాలు కూడా తక్కువగా ఉన్నాయన్నారు. ఇది ప్రపంచ వ్యాప్తంగా జరిగిన పరిశీలనలో తేలిందన్నారు. కరోనా తీవ్రత లేదని నిర్లక్ష్యం చేయొద్దు. ప్రతి ఒక్కరూ కూడా వ్యాక్సిన్ వేయించుకొని సురక్షితంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వ్యాక్సినేషన్ పక్రియలో విరామం లేకుండా పని చేస్తున్న ఆశా వర్కర్లకు మంత్రి హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. కరోనా సమయంలో సేవలు అందించిన వారికి కచ్చితంగా గుర్తింపు ఉంటుందని హరీశ్‌రావు స్పష్టం చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నేషనల్ వ్యాక్సిన్ డే అయిన మార్చి 16వ తేదీన 12-14 ఏళ్ల పిల్లలకు టీకాలు వేసే కార్యక్రమం ప్రారంభించడం సంతోషంగా ఉంది. దేశ వ్యాప్తంగా టీకాల కార్యక్రమం నేటి నుండి మొదలవుతుంది. హైదరాబాద్ కి చెందిన బయాలజికల్ ఇ లిమిటెడ్ అభివృద్ధి చేసిన కొర్బెవాక్స్ టీకాను అర్హులైన పిల్లలకు ఇవ్వడం జరుగుతుంది. కరోనా నుంచి ప్రజలను కాపాడేందుకు ప్రపంచానికి తెలంగాణ రెండు టీకాలను అందించింది. మొదటిది భారత్ బయోటెక్ అభివృద్ధి చేసిన కొవాగ్జిన్ అయితే.. రెండోది బయోలాజికల్ ఈ తయారు చేసిన కార్బెవ్యాక్స్. కరోనా థర్డ్ వేవ్ ముగిసిందనో.. థర్డ్ వేవ్ లో పెద్దగా ప్రభావం చూపలేదనో.. కొత్త వేరియంట్ ఇప్పుడు వస్తుందా? రాదా? అనే అనుమానాలతో టీకాలు వేసుకోవడంలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. అన్ని ప్రభుత్వ పీహెచ్ సీలు, యూపీహెచ్ సీల్లో వాక్సినేషన్ అందించటం జరుగుతుంది. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు వైద్యారోగ్య శాఖ ఏర్పాటు చేసింది. తల్లిదండ్రుల సమక్షంలో వ్యాక్సిన్ ఇవ్వడం జరుగుతుంది. 12-14 ఏండ్ల మధ్య వయసువారికి కార్బొవ్యాక్స్ వేస్తున్నాం. మన దేశంలో ఈ వయసు పిల్లలకు వేసేందుకు అనుమతి పొందిన ఏకైక టీకా కార్బొవ్యాక్స్. దీనిని అభివృద్ధి చేసిన బయోలాజికల్-ఈ తెలంగాణ కంపెనీ కావడం మనందరికీ గర్వకారణం' అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, స్థానిక ప్రజాప్రతినిధులు, డిఎంఇ రమేష్ రెడ్డి, డిహెచ్ శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

# నల్లగొండలో చైర్మన్ గుత్తాకు ఘనస్వాగతం

### రెండోసారి చైర్మన్‌గా రావడంతో నేతల స్వాగతం

### అభినందించిన కలెక్టర్, ఎస్పీలు



**నల్లగొండ, మార్చి 16 (అక్షర వెలుగు):** శాసనమండలి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన గుత్తా సుఖేందర్ రెడ్డి తొలిసారిగా నల్లగొండకు రాగా ఆయనకు గనస్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక ప్రజాప్రతినిధులు, టీఆర్ఎస్ పార్టీ నేతలు, శ్రేణులు, అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. నల్లగొండలోని ఆయన నివాసం వద్ద పెద్దఎత్తున పటాకులు కాల్చారు. తన నివాసం వద్ద గుత్తా సుఖేందర్ రెడ్డి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, జిల్లా ఎస్పీ రెమా రాజేశ్వరీ.. మండలి చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నేతలు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు, ప్రజాప్రతినిధులు గుత్తాను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. శాసనమండలి చైర్మన్‌గా గుత్తా సుఖేందర్ రెడ్డి రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం ఆయన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. శాసనమండలి చైర్మన్ ఎన్నికకు సంబంధించి గుత్తా సుఖేందర్ రెడ్డి ఒక్కరే నామినేషన్ దాఖలు కావడంతో.. ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్టుగా అధికారులు ప్రకటించారు. కాగా, తెలంగాణ ఏర్పాటైన తర్వాత 2014లో మండలికి తొలి చైర్మన్‌గా స్వామిగౌడ్ ఎంపికయ్యారు. ఆ తర్వాత 2019 మార్చిలో ఆయన పదవీకాలం ముగియడంతో అప్పటికే ఎమ్మెల్సీగా ఉన్న గుత్తా సుఖేందర్ రెడ్డి చైర్మన్ ఎంపికయ్యారు. ప్రస్తుతం మళ్లీ చైర్మన్ పదవిని అలంకరించారు. మండలి సమావేశాలు కూడా మంగళవారం ముగియడంతో ఆయన బుధవారం నల్లగొండ చేరుకున్నారు.

# పంజాబ్ సిఎంగా భగవంత్ మాన్ ప్రమాణం

### భగత్ సింగ్ స్వగ్రామంలో ప్రమాణస్వీకార కార్యక్రమం



**చండీఘడ్, మార్చి 16 (అక్షర వెలుగు):** పంజాబ్ సీఎంగా భగవంత్ మాన్ బుధవారం మధ్యాహ్నం ప్రమాణ స్వీకారం చేశారు. స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ పూర్వీకుల గ్రామం నవన్‌షహర్ జిల్లా ఖట్కర్ కలాన్‌లో భగవంత్ మాన్ ప్రమాణస్వీకారం చేశారు. పంజాబ్ గవర్నర్ భన్వరిలాల్ పురోహిత్ మాన్‌చే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ఢిల్లీ సీఎం, ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ హాజరయ్యారు. పంజాబ్ ఎన్నికల్లో 117 స్థానాలకు గాను ఆప్ 92 స్థానాల్లో గెలుపొందగా పాలక కాంగ్రెస్ కేవలం 18 సీట్లతో సరిపెట్టుకుని పరాజయం మూటగట్టుకుంది. మాధురీ అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి దల్వీర్ సింగ్ గోల్డీపై మాన్ 58,206 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఇక ఆప్ ప్రభంజనంతో సీఎం చరణ్జిత్ సింగ్ చన్నీ, రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ నవజ్యోత్ సింగ్ సిద్ధూ, మాజీ సీఎం కెప్టెన్ అమరీందర్ సింగ్ సహా పలువురు రాష్ట్ర మంత్రులు, దిగ్గజ నేతలు ఓటమి చవిచూశారు. అలాగే సిఎం పదవి చేపట్టక ముందే మాన్ తన ఎంపి పదవికి రాజీనామా చేశారు.

# బోయింగ్‌కు విమాన విడిభాగాల సరఫరా

(మొదటి పేజీ తరువాయి..)ఇంజినీరింగ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ రాకేశ్ చోప్దార్ వెల్లడించారు. విమాన విడి భాగాలను తయారు చేసి, సరఫరా చేయడానికి ఆజాద్ ఇంజినీరింగ్ కంపెనీతో 2021, జులైలో బోయింగ్ సంస్థ ఒప్పందం కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఎండీ రాకేశ్ మాట్లాడుతూ.. బోయింగ్ సంస్థకు విమానాల విడి భాగాలను అనుకున్న సమయానికే అందించామని తెలిపారు. తమ కంపెనీ తయారు చేసిన విమానాల విడి భాగాలను ప్రపంచ వ్యాప్తంగా ఉన్న బోయింగ్ విమానాలన్నిం టిలో ఉపయోగిస్తారు. ఈ క్రమంలో తెలంగాణకు, దేశానికి ఇది ఒక ముఖ్యమైన సందర్భం అని పేర్కొన్నారు. తయారీ ఏర్పాటు నుంచి మొదలుకుంటే.. అనుమతులు, అంచనాలు, ఆడిట్స్ పూర్తి చేసుకుని, విమానాల విడి భాగాలను తయారు చేసి సరైన సమయానికి అందించడం అంత సులభం కాదన్నారు. ఈ మైలురాయిని సాధించేందుకు చాలా కష్టపడ్డామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా విమానాల విడి భాగాలను సకాలంలో అందించిన ఆజాద్ ఇంజినీరింగ్ కంపెనీకి బోయింగ్ ఇండియా సప్లై చైన్ ఎండీ అశ్వినీ భార్గవ అభినందనలు తెలిపారు. ఆజాద్ ఇంజినీరింగ్‌తో సుదీర్ఘమైన, విజయవంతమైన భాగస్వామ్యం కోసం తాము ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నారు.

# హిజాబ్ కర్నాటక తీర్పుపై సుప్రీంలో పిటిషన్

(మొదటి పేజీ తరువాయి..) సవాలు చేశారు. హిజాబ్ ధరించడం అనేది భావప్రకటనా స్వేచ్ఛ అని, రాజ్యాంగంలోని 19(1)(ఏ) నిబంధన కిందకు వస్తుందని, కోర్టు ఈ విషయాన్ని పరిగణనలో తీసుకోలేదని ఆమె అన్నారు. హిజాబ్ ధరించడం అనేది రాజ్యాంగంలోని 25వ అధికరణ చెబుతున్న 'రైట్ టు కన్‌సైన్స్' కిందకు కూడా వస్తుందన్నారు. ఇది వ్యక్తిగత హక్కు అని పేర్కొన్నారు. మతపరంగా తప్పనిసరా కాదా అనేది కోర్టు ఇలాంటి సందర్భాల్లో అప్లయ్ చేయరాదని అన్నారు. కాగా, హైకోర్టు తీర్పుపై బీజేపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. తీర్పును మహిళా సాధికారత కోణంలో డాలే కానీ, రాజకీయ కోణంలో చూడరాదని అన్నారు.

# సమ్మక్క-సారలమ్మపై చినజీయర్ వ్యాఖ్యలు

(మొదటి పేజీ తరువాయి..)తల్లులది వ్యాపారమా?... మీరు సమతామూర్తి విగ్రహం ఏర్పాటుతో చేసింది వ్యాపారమా?... మా దేవతల దర్శనానికి ఒక్క రూపాయి కూడా టికెట్ లేదు, కానీ మీరు పెట్టిన 120 కిలోల బంగారం గల సమతామూర్తి విగ్రహం చూడ్డానికి 150 రూపాయలు టికెట్ ధర పెట్టారు. ఎవరిది వ్యాపారం?... మీది బిజినెస్, సమ్మక్క సారలమ్మ తల్లి దగ్గర ఇలాంటి వ్యాపారం జరగదు అని సీతక్క అన్నారు. లక్ష రూపాయలు తీసుకోకుండా ఏవరైనా పేద వారి ఇంటికి వెళ్ళారా? అని ప్రశ్నించారు. చిన్నజీయర్ వ్యాఖ్యలపై తెలంగాణ ప్రభుత్వం వెంటనే స్పందించాలని, రియల్ ఎస్టేట్ స్వామి అయిన చిన్న జీయర్ స్వామికి తగిన బుద్ధి చెప్పాలని సీతక్క డిమాండ్ చేశారు.

## (ఆధ్యాత్మిక చింతన )

# భవిష్యత్ గురించి ప్రణాళిక అవసరం

**తిరుమల, మార్చి 16 (అక్షర వెలుగు):** భవిష్యత్తు గురించి ముందుగా ప్రణాళికలు వేసుకుని పనిచేసే సామర్థ్యం చాలామందికి ఉండదు. ఎందుకంటే మనం వర్తమానానికి బందీలం. పక్కనే ఉన్న ప్రమాదాలను, సంతోషాలను అధిగమించి పనిచెయ్యడం ఒక గొప్ప శక్తి. వెనక్కి తగ్గే స్వభావాన్ని విడిచిపెట్టాలి. కళ్లకు కనిపించే దానికన్నా భవిష్యత్తులో గొప్పవి జరగబోతున్నాయని ఊహించడం నేర్చుకోవాలి. సాధారణంగా మనం తప్పులు చెయ్యడానికి కారణం- మన దగ్గరగా ఉన్న ప్రమాదాలకు భయపడటం, దూరంగా ఉన్న ప్రమాదాలను పట్టించుకోకపోవడం! వాటినిగాని మనం ముందుగా ఊహించి అంచనా వెయ్యగలిగితే చాలా పొరపాట్లు నివారించవచ్చు.ఒకవేళ అనుకోని ప్రమాదం ఏదైనా ఎదురైతే, దాన్ని తెలివిగా మనకు అనుకూలంగా మార్చుకోవాలి. ఆంజనేయుడి తోకకు రావణాసురుడు నిప్పుపెట్టాడు. లంకలో రాక్షసులంతా తెగ ఆనందపడిపోయారు, హనుమంతుడు కాలి బూడిదైపోతాడని. అలా జరగలేదు. లంకనే తన తోకతో తగలబెట్టాడు హనుమంతుడు. ప్రమాదాన్ని తనకు అవకాశంగా ఉపయోగించుకుని చరిత్రలో ఒక గొప్ప రసవత్తరమైన ఘట్టంగా మలిచాడు ఆయన.పనులు ప్రారంభించేటప్పుడు వ్యవహారం నడిపేది మనం. వాటిని ఒక పద్ధతిలో నడిపించేది మనమే. ఒకసారి అవి ప్రారంభమయ్యాక, చాలాసార్లు అవే మనకు దారి చూపిస్తాయి. మన లక్ష్యాన్ని నెరవేరుస్తాయి!

## కాంగ్రెస్ పార్టీలో చేరికలు

### కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్



**భద్రాద్రి కొత్తగూడెం, మార్చ్ 16 (అక్షర వెలుగు):** భద్రాద్రి కొత్తగూడెం, కరకగూడెం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కరకగూడెం గ్రామ పంచాయతీ లోని ముగ్గురు వార్డు మెంబర్ లు,నాయకులు కొమరం రామకృష్ణ, పోలెబోయిన సుజాత, పూనెం సరిత టిఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీ లోకి చేరారు ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కరకగూడెం మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ఎంతో మంది పేదలకు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినట్లు చెప్పారు. ప్రతి పేదోడి గుండెల్లో హస్తం గుర్తు నిలిచిపోయిందని దానిని తుడిచి పెట్టడం ఎవరికి సాధ్యం కాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగ బండి వెంకటేశ్వర్లు, మండల యువజన అధ్యక్షులు కునుసోత్ సాగర్, సీనియర్ నాయకుడు మాజీ ఎంపిటిసి దుర్గం సంజీవ, కార్యదర్శి షేక్ రఫీ, మేడి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## సేవా గుణం చాటుతున్న గొనెల నాని

### కాలినడకన వస్తున్న రామయ్య భక్తులకు గొనెల నాని అల్పాహారం ఏర్పాటు



**భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 16 (అక్షర వెలుగు):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం కేంద్రం మీదుగా జంగారెడ్డిగూడెం మండలం, వేగవరం గ్రామనుండి గత15 సంవత్సరాలుగా భద్రాచలం రామయ్య దర్శనంకు 150 మంది భక్తులు128కిలోమీటర్లు పాదయాత్ర గా వస్తు ఉంటారు... ఈ సంవత్సరం కూడా వస్తున్నారు అనే విషయం తెలుసుకున్న టిఆర్ఎస్ మండల యువత అధ్యక్షుడు గొనెల నాని వారికి సాదరంగా స్వాగతం పలికి అల్పాహారం ఏర్పాటు చేయడం జరిగింది. తాము 15 సంవత్సరాల నుంచి ఈ మార్గం గుండా వస్తున్న ఎవరు కూడా ఇలా స్వాగతం పలికి మాకు ఆకలి తీర్చే ఏర్పాట్లు చేయలేదు, ఈ సంవత్సరం ఎంతో ఆనందంగా నాకు స్వాగతం పలికి ఆకలి తీర్చిన గోనెల నానికి ధన్యవాదాలు అని రాముడు ఆశీస్సులు ఇలాంటి మంచి పని చేసే వారికి ఎప్పుడూ ఉంటాయని,ఈకార్యక్రమంపై భక్తులు హర్షం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో వెంకట సిద్ధార్థ, కళ్యాణ్ కౌశిక్, గొనెల రాము,స్టాలిన్,శివ, పవన్, కన్నెబోయిన జంపన్న ,వారి మిత్ర బృందం పాల్గొన్నారు.

## మార్చి 28, 29 తేదీలలో జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

### ఐ.ఎఫ్.టి.యు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్. మధుసూదన్ రెడ్డి




**భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 16 (అక్షర వెలుగు):** ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ కార్పొరేట్ లకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ, 44 కార్మిక చట్టాలను 4కోడ్‌లుగా మార్చి, కార్మిక హక్కులను హరిస్తున్న మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మార్చి 28, 29 తేదీల్లో జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఐ.ఎఫ్.టి.యు జిల్లా ఉపా ధ్యక్షుడు ఆర్. మధుసూదన్ రెడ్డి కార్మి కులను కోరారు. బుధవారం స్థానిక దుర్గ ఓబీ కార్మికుల దగ్గర సమ్మె పోస్టర్ ఆవిష్కరణ చేశారు. అనంతరం కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూప్రజల రక్తమాంసాల ద్వారా సృష్టించిన ఈ దేశ సంపదలైన ప్రభుత్వ రంగ సంస్థలను దేశ సంపదను మొత్తం కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి నరేంద్ర మోడీ ప్రభుత్వం కంకణం కట్టుకున్నది అని విమర్శించారు. మోడీ ప్రభుత్వం యొక్క ప్రజా వ్యతిరేక విధానాలను ఈ దేశ ప్రజానీకం మొత్తం వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. అదే విధంగా కార్మికవర్గం తరతరాలుగా త్యాగాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్ లుగా మార్చి, కార్మిక హక్కులను హరిస్తున్నారని విమర్శించారు. అసంఘటిత రంగ కార్మికులు,హమాలీ,మోటార్, భవన నిర్మాణ, తదితర కార్మికులకు ఎటువంటి హక్కులు లేకుండా చేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి కార్మిక వ్యతిరేక విధానాలను ఈ దేశ కార్మికవర్గం మొత్తం వ్యతిరేకించ వలసిన అవసరం ఉందన్నారు. రైతాంగ పోరాట స్ఫూర్తితో కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను కార్మికవర్గం తిప్పికొట్టాలి అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ కు వ్యతిరేకంగా, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా ఈ నెల 28, 29 తేదీల్లో జరుగుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికవర్గం మొత్తం పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో వేణుగోపాల్, జగన్, రఘు ,నరసింహ గౌడ్, యుగంధర్, నాగ వంశీ, భాష, నాయుడు, శివాని, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

## వ్యాక్సినేషన్‌ను ప్రారంభించిన మంత్రి గంగుల



**కరీంనగర్, మార్చి 16 (అక్షర వెలుగు):** కరీంనగర్‌లోని బుట్టిరాజారాం కాలనీలో పట్టణ ప్రాథమిక వైద్యా కేంద్రంలో 12 సంవత్సరాల నుండి 14 లోపు వయస్సు పిల్లలకు కోవిడ్ వ్యాక్సినేషన్ ను ప్రారంబించిన పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్, మేయర్ సునిల్ రావు, జెడ్పీ చైర్పన్ కనుమల విజయ, కలెక్టర్ ఆర్.వి కర్ణన్, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, కమీషనర్ సేవా ఇస్లావత్.

## టీకాతోనే..పిల్లలకు రక్షణ

### ఎంపీపీ రేగా కాళిక ● టీకాలపై అపోహలు వద్దు



**భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 16 (అక్షర వెలుగు):** కరకగూడెం మండలం లో కరోనా వైరస్ నుండి పిల్లలకు రక్షణ పొందదానికి టీకాలు తప్పనిసరిగా వేయించాలని కరక గూడెం ఎంపీపీ రేగా కాళిక, పీహె చ్‌సీ వైద్యాధికారి పర్షియా నాయక్ పిలుపు నిచ్చారు. ఈ మేరకు బుధవారం స్థానిక పిహెచ్ సీలో 12-14 సంవత్సరాల పిల్లలకు టీకా కార్య క్రమంను ఎంపీపీ ప్రారంభించారు. అనంతరం 40 మంది పిల్లలకు టీకాలు వేసారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ..టీకాలపై అపోహలు వద్దని తల్లిదండ్రులు తమ పిల్లలకు విధిగా టీకాలు వేయించాలని కోరారు. అలాగే జిల్లా కలెక్టర్ అనుదీప్ సార్ ,డీఎంహెచ్‌ఓ శిరీష మేడం ఆదేశాల మేరకు కోవిడ్ వాక్సినేషన్లో భాగంగా మెరుగైన పనితీరు కనబరిచిన డాక్టర్ పర్షియా నాయక్ ను ఎంపీపీ ఘనంగా సన్మానించారు. అంతేకాకుండా పలువురు ఎఎన్‌ఎంలకు,ఆశా కార్యకర్తలను కూడా వాక్సినేషన్లో చురుగ్గా పనితీరు కనబర్చినందుకు ప్రశంస పత్రాలను అందజేశారు.కార్యక్రమంలో కరకగూడెం సర్పంచ్ ఊకె రామనాథం,చిరుమల్ల ఆశ్రమం పాఠశాల హెచ్‌ఎం జగన్,పలువురు ఉపాధ్యాయులు పిహెచ్ సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టీటీడి తరహాలో కరీంనగర్ వెంకటేశ్వర స్వామీ ఆలయం నిర్మిస్తాం

### 610 కోట్ల తో వివిద అభివృద్ధి పనులకు మంత్రి కేటిఆర్ శంఖుస్థాపన

### రాష్ట్ర బీసీ సంక్షేమ పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్



**కరీంనగర్, మార్చి 16 (అక్షర వెలుగు):** పల్లెలు పట్టణాలుగా మారి పట్టణాలు అధునీకరణ చెందాలనేది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన లక్ష్యం అని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ కెలెక్టరెట్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సాంస్కృతిక చైర్మన్ రసమయి బాలకిషన్, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జెడ్పీ చైర్ పర్సన్ కనుమల్ల విజయ, మేయర్ సునిల్ రావు, ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి, సుడా చైర్మన్ జి.వి రామకృష్ణ రావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూప రాణీతో కలిసి మీడియా తో మాట్లాడారు. ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే రెండో గొప్పనగరంగా మార్చాలనే ఉద్దేశంతో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఇందులో బాగంగానే రేపు పురపాలక ఐటీ శాఖా మంత్రి కేటిఆర్ కరీంనగర్ లో పర్యటించనున్నారని తెలిపారు. మానేరు వంతెన పై రివర్ ఫ్రంట్, 24/7 వాటర్ సప్లై పాయిలెట్ ప్రాజెక్టు అభివృద్ధి పనులకు శంఖు స్థాపన చేయడంతో పాటు మీషన్ భగీరథ వాటర్ పైలాన్ ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం మార్కు ఫేడ్ గ్రౌండ్ లో నగరపాలక సంస్థ వివిద స్మార్ట్ సిటీ ప్రాజెక్టు అభివృద్ధి పనుల శంఖు స్థాపన చేసి సభలో ప్రసంగిస్తారని వెల్లడించారు. అనంతరం చొప్పదండిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభం చేసిన అనంతరం తిరిగి కరీంనగర్ చేరుకొని బీసీ స్టడీ సర్కిల్ భవనంను ప్రారంభించి.జిల్లా మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. పట్టణాల ఆధునీకరణ జరిగితేనే అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. నగరంలో ట్రాఫిక్ ఐలాండ్స్, కొత్తగా 4 జంక్షన్లను భగవత్ గీత చరిత్ర ఉట్టి పడేలా దైవ విగ్రహాలతో సుందరీకరిస్తామని తెలిపారు. ట్రాఫిక్ సిగ్నలింగ్ కమాండ్ కంట్రోల్ సిస్టమ్, సీసీ సర్వలెన్స్ కెమెరాను ఏర్పాటు చేస్తామన్నారు. 18 కోట్ల బయో మైనింగ్ ప్రక్రియలో భాగంగా డంపింగ్ యార్డు శాశ్వత పరిష్కారం చూపుతామని పనులు కూడ ప్రారంబిస్తామని తెలిపారు. 133 కోట్ల రూ. నిధులతో నగర వ్యాప్తంగా స్టాంవాటర్ డ్రైనేజీ పనులకు మరియు 90 కోట్ల రూ. రోడ్లును అధునీకరణ పనులకు కూడ భూమీ పూజ చేస్తామని తెలిపారు. కరీంనగర్ నగరానికి తలమానికంగా మానేరు రివర్ ఫ్రంట్ నిలుస్తుందని మొత్త 410 కోట్లతో రివర్ ఫ్రంట్ ను 18 నెలల్లో పూర్తి చేసేలా చర్యలు తీస్కుంటామన్నారు. ఇందులో 100 కోట్ల రూ. నిధులను మ్యూజికల్ వాటర్ పౌంటెన్, స్పీడ్ బోటింగ్ కు కేటాయిస్తామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి కేసిఆర్ జిల్లాకు మంజూరు చేసిన మెడికల్ కళాశాల కోసం రెండు చోట్ల స్థల పరిశీలన కూడ చేశామని స్పష్టం చేశారు. ఉజ్వల పార్కు రోడ్డులో గల పాత శాతవాహన యూనివర్సిటీ 31 ఎకరాల స్థలం, కొత్తపల్లిలోని సీడ్ కంపెనీకి సంబందించిన 46 ఎకరాల స్థలాన్ని పరిశీలన చేశామన్నారు. త్వరలోనే బావి తరానికి నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి గొప్ప నగరంగా అందిస్తామని తెలిపారు. అభివృద్ధి పనుల పై కరీంనగర్ జిల్లా కు వస్తున్న పురపాలక శాఖ మంత్రి కేటిఆర్ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. అంతే కాకుండ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ తిరుమల శ్రీవారి ఆలయ నిర్మాణానికి కరీం నగరం నడిబొడ్డున పద్మా నగర్ లో పది ఎకరాల స్థలం కేటాయించినట్లు ప్రకటించారు. ఉత్తర తెలంగాణలోనే టీటీడి తరహాలో మరో శ్రీవారి ఆలయంను నిర్మాణం చేస్తామన్నారు. రెండు నెలల్లో ఆలయం నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించి, 18 నెలల లోగా ఆలయాన్ని ప్రజలకు అందుబాటులోకి తెస్తామని మంత్రి తెలిపారు. శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి స్థలాన్ని కేటాయించడంపై ముఖ్యమంత్రి కేసీఆర్ కు జిల్లా ప్రజల పక్షాన మంత్రి గంగుల కమలాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

## కెసిఆర్‌ను గద్దెదించే పార్టీకి మద్దతు

### పార్టీ మారే విషయమై త్వరలో నిర్ణయం: మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్



**యాదాద్రి, మార్చి 16 (అక్షర వెలుగు):** మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సీఎం కేసీఆర్‌ను గద్దె దింపే ఏ పార్టీకైనా సపోర్ట్ చేస్తానని ప్రకటించారు. రాష్ట్రాన్ని అప్పుల తెలంగాణగా చేసిన ఘనత కేసీఆర్‌దేనని తప్పుబట్టారు. కాళేశ్వరం రీడిజైనింగ్ పేరుతో ఏపీ కాంట్రాక్టర్లకు లక్షల కోట్లు దోచిపెట్టారని దుయ్యబట్టారు. 8 ఏళ్లుగా ప్రభుత్వ పాఠశాల లను పట్టించుకోని కేసీఆర్.. ఇప్పుడు మన ఊరు-మన బడి అని కార్యక్రమాలు తెస్తున్నారని విమర్శించారు. శిథిలావస్థలో ఉన్న ఆస్పత్రులను బాగు చేయకుండా.. కొత్త ఆస్పత్రులు కడతామ ంటున్నారని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విమర్శించారు.

## నూతన ఏటీఎంను ప్రారంభించిన ఎస్బిఐ జనరల్ మేనేజర్ శేఖర్



**నాగార్జునసాగర్, మార్చి 16,( అక్షర వెలుగు):** భారతీయ స్టేట్ బ్యాంక్ నాగార్జునసాగర్ శాఖ ఆధ్వర్యంలో పైల్వాన్ జెన్కో కాలనీ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఏటీఎం ఎస్బిఐ బ్యాంక్ జనరల్ మేనేజర్ ఎల్ శేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకింగ్ సేవల తోపాటు ఖాతాదారులకు మెరుగైన సేవలను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నల్గొండ అడ్మినిస్ట్రేటివ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ బంగార్రాజు మాట్లాడుతూ ఆధునిక సాంకేతికత తో ముందుకు వెళుతున్న మన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్బిఐ జనరల్ మేనేజర్ ప్రమాదవశాత్తు మరణించిన బ్యాంకు ఖాతాదారుని కుటుంబ సభ్యులకు ఇన్సూరెన్స్ ద్వారా లభించిన 20 లక్షల చెక్కును అందజేశారు. నల్గొండ రీజినల్ మేనేజర్ విజయ్ కుమార్,టీఎస్ జెన్కో చీఫ్ ఇంజనీర్ సూర్యనారాయణ రావు, ఎస్.ఈ రఘురాం, స్థానిక బ్రాంచ్ మేనేజర్ ఎన్.వి.రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

## సింగరేణిలో దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



**మందమర్రి, మార్చి 16 (అక్షర వెలుగు):** సింగరేణి పరిధిలోని బొగ్గు క్షేత్రాల వేలానికి వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు నిర్వహించ తలపెట్టిన మార్చి 28,29 రెండు రోజుల దేశ వ్యాప్త సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొని, సమ్మెను జయప్రదం చేయాలని టీబీజీకేఎస్ మందమర్రి ఏరియా ఉపాధ్యక్షులు మేడిపల్లి సంపత్ కోరారు. బుధవారం మందమర్రి పట్టణంలోని టీబీజీకేఎస్ యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మెకు టీబీజీకేఎస్ సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. సింగరేణిలో బొగ్గు గనుల వేలాన్ని తక్షణమే నిలిపివేసి, సింగరేణికి నూతన బొగ్గు గనులు కేటాయించి, భవిష్యత్ తరాలకు సింగరేణిని యధాతథంగా అప్పగించాలని డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థను సంపూర్ణంగా కాపాడుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్కాసుమన్ ఆధ్వర్యంలో మరో తెలంగాణ ఉద్యమం తరహా ఉద్యమం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ రీజియన్ కార్యదర్శి ఓ రాజశేఖర్, ఏరియా నాయకులు మిట్ట సూర్యనారాయణ, శంకర్రావు, సామంతుల స్వామి, రాజిరెడ్డి, భిక్షపతి, జి రాంచందర్, ఎడుకోల పవన్, పిట్ కార్యదర్శులు బిల్లా మాధవరెడ్డి, జీడి బాపు, రావు కొండలరావు, జే శ్రీనివాస్, కారుకూరి తిరుపతి, రాజ్ కుమార్, యుగంధర్, మద్దెల శంకర్, సామల రాజమౌళి, బబ్బెర మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్యూన్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు



**మందమర్రి, మార్చి 16 (అక్షర వెలుగు):** సింగరేణి సంస్థ మందమర్రి ఏరియాలో ఖాళీగా ఉన్న ప్యూన్ పోస్టుల భర్తీకి బుధవారం ఏరియా జీఎం కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్న కార్మి కులకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఏరియా ఎస్ఓటు జీఎం గోపాల్ సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏరియాలో ఖాళీగా ఉన్న 3 ప్యూన్ పోస్టుల కోసం 8 మంది కార్మికులు దరఖాస్తు చేసుకోగా, ఇంటర్వ్యూకు 8 మంది కార్మికులు హాజరు కావడం జరిగిందన్నారు. వీరిలో ముగ్గురు కార్మికులను ఎంపిక చేసి, ఏరియాలో ఖాళీగా ఉన్న వివిధ గనులు, విభాగాలకు పంపడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్ వరప్రసాద్, ఐఈడి (డిజిఎం) రాజన్న, డివైపిఎం శ్యామ్ సుందర్, పర్సనల్ విభాగం కార్యాలయ సూపరింటెండెంట్ రాజలింగు తదితరులు పాల్గొన్నారు.

## కరాటే, కూఫ్యూలో బంగారు పతకాలు

### సాధించిన కలవచర్ల గ్రామ విద్యార్థులు



**పెద్దపల్లి, మార్చి 16 (అక్షర వెలుగు):** 15న తెలంగాణ స్టేట్ లెవల్ కరాటే, కూఫ్యూ ఛాంపియన్ షిప్ ఈనెల 13 న జరిగిన స్టేట్ లెవెల్ ఛాంపియన్షిప్ లో గెలుపొందిన రామగిరి మండలం కలవచర్ల గ్రామానికి చెందిన ఐదుగురు విద్యార్థులకు కరాటే అండ్ కూఫ్యూలో గెలుపొందిన వారికి మాస్టర్ మారుపాక సంపత్, రామగిరి పోలీస్ ఎస్ ఐ కట్కే రవి ప్రసాద్ ,మాస్టర్ కు మరియు గెలుపొందిన వారికి అభినందించారు. అనంతరం స్థానిక ఎస్ఐ ఆధ్వర్యంలో మెడల్స్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

## హంగులు.. ఆర్భాటాలకే పరిమితమా !

### నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

- స్థానిక సమస్యలపై మంత్రి కేటీఆర్ దృష్టి పెడతారా..?
- నాణ్యత లేమితో చెక్ డ్యాంలు కొట్టుకుపోయినవి..మరి రివర్ ఫ్రంట్ నిలబడుతుందా..?
- కేటీఆర్ ప్రసన్నం కోసం నగరంలో తాత్కాలికంగా రెండు ఐలాండ్ పనులు..?
- నగరంలో రోజు నీళ్లు రావడం లేదు..24 గంటల నీళ్లు ఇవ్వడానికి బరోసా ఇవ్వగలరా..
- నగర పాలక సంస్థకు కమిషనర్ గా ఐఏఎస్ అధికారిని ఎందుకు నియమించడం లేదు..?
- మంత్రి., మేయర్ తీరుతో బల్దియా అవినీతికి కేరాఫ్ అడ్రస్ గా మారింది..
- బద్దీపల్లిలోని ఇందిరమ్మ కాలనీ లో ఇండ్లు పూర్తి కాని లబ్ది దారులందరికి డబల్ బెడ్రూం ఇండ్లు నిర్మించుకోవడానికి 3లక్షలు ఇవ్వాలి..
- నగరాన్ని టిఆర్ఎస్ నేతలు ఫ్లెక్సీలతో నింపేస్తే మున్సిపల్ అధికారులకు కన్పించడం లేదా..టిఆర్ఎస్ కు ఓ న్యాయం.. ఇతర పార్టీలకు ఓ న్యాయమా..?
- కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఫైర్




**కరీంనగర్, మార్చి 16 (అక్షర వెలుగు):** రాష్ట్ర ఐటీ, మున్సిపల్ మంత్రి కేటీఆర్ కరీంనగర్ పర్యటన హంగులు.. ప్రచార ఆర్భాటాలు, స్వంత డబ్బా కొట్టుకోవడానికి పరిమితం కాకుండా స్థానిక సమస్యలపై స్పందించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం నగరంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కోమటిరెడ్డి పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మంత్రి కేటీఆర్ కు పలు అంశాల సమస్యలపై వినతిపత్రాన్ని ఇస్తామని పోలీసు అధికారులను అనుమతి కోరితే ఇప్పటి వరకు సడి సప్పుడు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ రాక సందర్భంగా నగరంలో టిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఫ్లెక్సీలతో నింపేస్తే వారిపై మున్సిపల్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని..బల్దియా అధికారులు కళ్లు మూసుకున్నార అని ప్రశ్నించారు. టిఆర్ఎస్ పార్టీకి ఓ న్యాయం.ఇతర పార్టీ నాయకులకు మరోవిధంగా న్యాయం ఉంటుందా అని అర్థం కావడం లేదన్నారు. మున్సిపల్ అధికారుల వైఖరి గర్హనీయమన్నారు. గతంలో నాణ్యత లేమితో..మంత్రి గంగుల అసమర్థ నిర్ణయాలతో భారీ వర్షాలకు, డ్యాం గేట్లు ఎత్తితే రివర్ ఫ్రంట్ చెక్ డ్యాంలు కొట్టుకుపోయినవని వాటిపై ఇంతవరకు విచారణ జరుగలేదని ఇప్పుడు రివర్ ఫ్రంట్ నిలబడుతుందా లేక చెక్ డ్యాం మాదిరిగానే చరిత్రలో నిలిచిపోతుందా అని ఎద్దేవా చేశారు. నగరంలో దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ఐలాండ్ మరియు వన్ టౌన్ ముందున్న ఐలాండ్ ను ఇన్ని రోజులు కళావిహీనంగా ఉంచి మంత్రి కేటీఆర్ ప్రసన్నం చేసుకునేందుకు తాత్కాలికంగా పనులు చేయిస్తున్నారని మండిపడ్డారు. నగరంలో రోజు మున్సిపల్ నల్లా నీరు సరిగ్గా రావడం లేదని, 2సార్లు డ్యాం గేట్లు ఎత్తిన నేపథ్యంలో వరద ఉధృతికి 800 డయా పైపులైన్ కొట్టుకుపోయిందనీ, పాలకుల అశ్రద్ధ వల్ల పైపులు వేయలేదని ఫలితంగా వేసవిలో నగర ప్రజలకు త్రాగు నీటి కష్టాలు మొదలయ్యాయన్నారు,24 గంటల నల్లా నీరు పథకాన్ని కేటీఆర్ ప్రారంభించడం కాదు.. చిత్తశుద్ధితో అమలు అయ్యేట్లు చర్యలు తీసుకోవాలన్నారు. 24 గంటల నల్లా నీరు ఇవ్వాలని 8ఏండ్లకు గుర్తుకు రావడం సంతోషమని ఎద్దేవా చేశారు. మున్సిపల్ కార్పోరేషన్ కు ఐఏఎస్ అధికారిని నియమిస్తామన్న సీఎం కేసీఆర్ గతంలో ఇచ్చిన హామీ ఏమైందని, బల్దియాను ఒక ప్రయివేటు లిమిటెడ్ కంపెనీలా మేయర్ సునీల్ రావు మార్చాడని, మున్సిపల్ కార్పోరేషన్ పేదల పాలిట శాపంగా.. పెద్దలకు..పరపతి ఉన్నోళ్లకు వరంగా మారిందని విమర్శించారు. నగరాన్ని, శివారు కాలనీల్లో మౌలిక వసతుల కల్పన నిధులు కేటాయిస్తామని చెప్పి.. ఏపాటి నిధులు కేటాయించారో జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కు ఐఏఎస్ అధికారిని నియమిస్తే మీ ఆగడాలకు అడ్డు వస్తదని, ఐఏఎస్ అధికారిని కమిషనర్ గా తీసకురావడం లేదని, ఇది మీ నిరంకుశ పాలన కాదని, ప్రయివేటు లిమిటెడ్ కంపెనీ కాదని ప్రజాస్వామ్య వ్యవస్థ అని మంత్రి గంగుల, మేయర్ సునీల్ రావుకు కేటీఆర్ అర్థం చేయించాలన్నారు. వీరిద్దరి హయాంలో మున్సిపల్ కార్పోరేషన్ అవినీతి కి కేరాఫ్ అడ్రస్ గా మారిందన్నారు. గత 8 ఏండ్లలో ఒక్క పేదవాడికి డబుల్ బెడ్ రూమ్ లు ఇవ్వలేదని, వేలాది నిరుపేదలకు 600 ఇండ్లు కడితే ఎలా సరిపోతాయో చెప్పాలన్నారు. కాంగ్రెస్ హయాంలో 7000మంది పేదలకు బద్దీపల్లి, చింతకుంటలో తలా అర్థగుంట ఇచ్చిన భూముల్లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణానికి రూ. 3 లక్షలు కేటాయించాలాన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సమద్ నవాబ్, ఎండి తాజ్, శ్రవణ్ నాయక్, చెర్ల పద్మ, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, అబ్దుల్ రెహమాన్, మామిడి సత్యనారాయణ రెడ్డి, విక్టర్, ముక్కా భాస్కర్, దండి రవీందర్, కొరివి అరుణ్, తమ్మడి ఏబ్రా, ఎండి. సలీముద్దీన్, నిహాల్, జీలకర్ర రమేష్, శహింషా, ఎండి. ఆమెర్, శబనా మహమ్మద్, మొసళ్ళ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అసదుద్దీన్ ఒవైసీకి 'పార్లమెంటేరియన్ ఆఫ్ ద ఇయర్' అవార్డు



**హైదరాబాద్, మార్చి 16 (అక్షర వెలుగు):** హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ బుధవారం లోక్‌మత్ పార్లమెంటరీ అవార్డుల ద్వారా "పార్లమెంటేరియన్ ఆఫ్ ద ఇయర్" అవార్డును అందుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఎంపీ మరియు యమ్ నేను యమ్ చీఫ్ తన అవార్డును ప్రకటించడానికి ట్విట్టర్‌లోకి తీసుకువెళ్లారు మరియు ట్వీట్ చేశారు, "నాకు "పార్లమెంటేరియన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు లభించిందని నాకు ఇప్పుడే తెలిసింది. ఎంపీలు ప్రభుత్వానికి జవాబుదారీగా ఉండాలి. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజా ప్రయోజనాల కోసం నా స్థానాన్ని ఉపయోగించాను అలాగే కొనసాగిస్తాను అని ఆయన అన్నారు. లోక్‌మత్ పార్లమెంటరీ అవార్డులు భారతీయ పార్లమెంటేరియన్‌లకు ఎనిమిది వేర్వేరు విభాగాలలో (లోక్‌సభ మరియు రాజ్యసభ నుండి ఒక్కొక్కటి నాలుగు) అందించినందుకు మంజూరు చేయబడ్డాయి. సభ ప్రతి సంవత్సరం బోర్డ్ ఆఫ్ జ్యూరీ 2020 మరియు 2021 సంవత్సరానికి అన్ని ఎంపీఎస్ యొక్క పార్లమెంటరీ సహకారాన్ని విజేతలను ఎంపిక చేయడానికి అధ్యయనం చేసింది. కోవిడ్-19 మహమ్మారి కారణంగా అవార్డుల కార్యక్రమం రెండేళ్లపాటు నిర్వహించబడలేదు..

## నూతన పట్టు వస్త్ర అలంకరణ కార్యక్రమానికి హాజరైన

### టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నారా బోయిన రవి ముదిరాజ్



**మునుగోడు, మార్చి 16 (అక్షర వెలుగు):** మునుగోడు మండలం కొరటికల్ గ్రామంలో అయిత గోని సైదులు గౌడ్ గారి కూతురు పట్టు వస్త్రాలంకరణ మహోత్సవానికి హాజరై వారిని ఆశీర్వదించిన టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నార బోయిన రవి ముదిరాజ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు ఉప సర్పంచ్ ఎల్లంకి యాదగిరి గ్రామ శాఖ అధ్యక్షులు అయితే గొని శేఖర్ ఓయూ విద్యార్థి జేఏసీ నాయకులు సిరి గ మల్ల కిషోర్ అయితే గొని యాదయ్య బొల్లం యాదయ్య అద్దంకి జగన్ సిరి గ మల్ల యాదయ్య రవి హరిబాబు దండు వెంకటరమణ పాత్రికేయులు దండు పరశురామ్ తదితరులు పాల్గొన్నారు

## ఎంపీఓకి వినతి పత్రం అందజేసిన సిఐటియు

### బానిసత్వంలోకి నెట్టే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



**ఇబ్రహీంపట్నం,మార్చి 16 (అక్షర వెలుగు):** గ్రామపంచాయతీ కార్మికులను పిఆర్సి వర్తింపజేయాలని తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ మరియు వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు గ్యార పాండు, సీ ఐ టి యు మండల కన్వీనర్ బుగ్గరాములు, మున్సిపల్ కన్వీనర్ ఎల్లేష్ డిమాండ్ చేశారు. ఈ నెల 28 29 న జరగబోయే దేశవ్యాప్త సమ్మె సందర్భంగా బుధవారం ఇబ్రహీంపట్నం ఎం పీ ఓ ,కి సమ్మె నోటీసు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు పీ ఆర్ సి వర్తింపజేయాలని తెలిపారు. 11వ పిఆర్సి ప్రకారం జీవో నెంబర్ 60 ప్రకారం కేటగిరీల వారీగా వేతనాలను ఇవ్వాలన్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 51 ప్రకారం అందరికీ 8500 వేతనం ఇవ్వాలని మల్టీ పర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేసి కారోబార్, బిల్ కలెక్టర్ లను స్పెషల్ స్టేటస్ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులను బానిసత్వంలోకి నెట్టే 4 లేబర్ కోడ్ లను రద్దు చేయాలనీ,కరోనా సమయంలో ముందు వరుసలో పనిచేసిన గ్రామపంచాయతీ సిబ్బందికి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని తెలిపారు. ఈ నెల 28 ,29న జరగబోయే దేశవ్యాప్త సమ్మెలో గ్రామపంచాయతీ కార్మికులు అందరు పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా,కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు యాదగిరి, కారోబార్ లు మల్లేష్, ఐలయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరంలో ప్రతి ఒక్కరు పాలుపంచుకోవాలి: ఎస్ ఎఫ్ ఐ, డివైఎఫ్ఐ



**ఇబ్రహీంపట్నం,మార్చి 16 (అక్షర వెలుగు):** భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ ఎఫ్ ఐ)మరియు భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డి వై ఎఫ్ ఐ)రంగారెడ్డి జిల్లా కమిటీల ఆధ్వర్యంలో మార్చి 23 వ తేదీన స్వాతంత్ర సమరయోధులు భగత్ సింగ్, రాజ్ గురు సుఖ్ దేవ్ ల 91 వ వర్ధంతి సందర్భంగా ఇబ్రహీంపట్నం లో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నారు.ఈ సందర్భంగా ప్రచార యాత్రను ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు మరియు డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని యాత్రను ప్రారంభించారు, ఈ సందర్భంగా వాళ్లు మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో విద్యార్థి యువజన పోరాటాలకు కేంద్రంగా పని చేస్తుందని, ఇక్కడ యువత లో చైతన్యం ఎక్కువని,అందుకే వారి వారసత్వంతో యువత ముందుకు పోవాల్సిన అవసరం ఉంది అన్నారు అదే విధంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం పేద ప్రజలకు మేలు అని అన్నారు ., నేటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థి యువకులను మోసం చేసే పనిలో ఉన్నాయని ఎన్నికల వేల ఎన్నో గొప్ప మాటలు చెప్పి గెలిచిన తర్వాత నిమ్మకు నిరెత్తినట్టు వ్యవహరిస్తున్నాయని అన్నారు. దేశంలో రాష్ట్రంలో ఉద్యోగాలు భర్తీ లేక నిరుద్యోగ స్థాయి పెరిగింది అన్నారు .ప్రభుత్వాలు బడ్జెట్ లో కూడా ఎక్కువ నిధులు కేటాయించాలని డిమాండ్ చేసారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం లోని యువకులు ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ కార్యకర్తలు వందల సంఖ్యలో పాల్గొని ఈ రక్తదాన కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శంకర్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజు, నాయకులు జగన్ అలంపల్లి జంగయ్య,చందు నాయక్,స్వామి, మస్కు చరణ్ ,సాయి కిరణ్ రాఘవేందర్,శ్రీకాంత్,శివ, రాఘవేందర్, తరంగ్ రవీందర్ సిద్ధూ తదితరులు పాల్గొన్నారు.

## భూ నిర్వాసితుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తా

### జిల్లా పరిషత్ చైర్మన్ టిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కుసుమ జగదీష్



**ఇబ్రహీంపట్నం, మార్చి 16 (అక్షర వెలుగు):** గోవిందరావుపేట మండల కేంద్రంలోని చల్వాయి గ్రామంలో ఐదవ పోలీస్ బెటాలియన్ ఏర్పాటు లో భూములు కోల్పోయిన రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ములుగు జిల్లా పరిషత్ చైర్మన్ కుసుమ జగదీష్ అన్నారు. బుధవారం గ్రామ సందర్శనకు కుసుమ జగదీష్ రాగా టిఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు నామ్ రవి సాదర స్వాగతం పలికి గ్రామ సమస్యలను వివరించారు. ఐదవ బెటాలియన్ ఏర్పాటు లో భూములు కోల్పోయిన భూనిర్వాసితులు జిల్లా పరిషత్ చైర్మన్ కుసుమ జగదీష్ కు న్యాయం చేయాలని వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ భూ నిర్వాసితుల సమస్యలు స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని భరోసా కల్పించారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని టిఆర్ఎస్ పార్టీ ఆదుకుంటుందని ఆయన అన్నారు. అనంతరం గ్రామంలో నెలకొన్న సమస్యలు పార్టీ అభివృద్ధి పై నాయకులను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల ప్రమాదానికి గురైన టిఆర్ఎస్ సీనియర్ నాయకులు రెండ్ల సంతోశ్ ను ఆయన పరామర్శించారు. అనంతరం టిఆర్ఎస్ నాయకుడు రవి ఆధ్వర్యంలో జగదీష్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు సూరపనేని సాయిబాబు. టిఆర్ఎస్ మండల ఇన్చార్జి నాయకులు పోరిక గోవింద్ నాయక్. టిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి లకావత్ నరసింహ నాయక్. టిఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి బూ రెడ్డి మధుసూదన్ రెడ్డి. బుఖ్య రాజు. చుక్క గట్టయ్య ఏనుగుల సాంబశివరావు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ నీటి ప్రాధాన్యతపై అవగాహన సదస్సు



**మందమర్రి, మార్చి 16 (అక్షర వెలుగు):** మందమర్రి పట్టణంలోని ఎంపిడిఓ కార్యాలయంలో మండల ఎంపిపి గుర్రం మంగ శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన ఆర్డబ్ల్యూఎస్ ఏఈ అంజన్ రావు, ఆయన సిబ్బందితో కలిసి బుధవారం మండలంలోని సర్పంచులకు, ఎంపీటీసీ సభ్యులకు, పంచాయతీ కార్యదర్శులకు మిషన్ భగీరథ నీటి ప్రాముఖ్యత గురించి అవగాహన సదస్సు నిర్వహించి, అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల జెడ్పిటిసి వేల్పుల రవి, వైస్ ఎంపీపీ ఎల్ రాజ్ కుమార్ లు హాజరయ్యారు. ముందుగా మండల ఎంపిడిఓ శశికళ, మండల పంచాయతీ అధికారి షేక్ సప్దర్ ఆలీ లు ఉదయం మండలంలోని శంకర్ పల్లి గ్రామ పంచాయతీ చేరుకొని, గ్రామంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించి, అనంతరం నర్సరీ, డంపింగ్ యార్డ్, వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనాలను పరిశీలించారు. అదేవిధంగా శంకర్ పల్లి, చిర్రకుంట, సారంగపల్లి పంచాయతీలకు ఐదు ఎకరాల చొప్పున బృహత్ పల్లె ప్రగతి వనం కొరకు గుర్తించిన స్థలాన్ని సందర్శించి, స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శికి నర్సరీ నిర్వహణపై పలు సూచనలు ఇచ్చారు. నర్సరి నిర్వాహణ బాగా లేనందున పంచాయతీ కార్యదర్శి పై ఆగ్రహం వ్యక్తం చేసి, శాఖ పరంగా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ఎంపీడిఓ కార్యాలయంలో నిర్వహించిన మిషన్ భగీరథ అవగాహన సదస్సుకు హాజరయ్యారు. సదస్సు అనంతరం పంచాయతీ కార్యదర్శులకు వారాంతపు ఉపాధి హామీ పథకం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకంలో 100మంది కూలీలకు పనులు కల్పించాలని, 100శాతం ప్లాంటేషన్ సర్వావల్ ఉండాలని, పంచాయతీ కార్యదర్శులు ఉదయం ఏడు గంటలకు గ్రామాలలో హాజరు కావాలని ఆదేశించారు. పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని, రోజువారీగా ప్రతి ఇంటి నుండి ట్రాక్టర్ ద్వారా తడి, పొడి చెత్తను సేకరించి, సేకరించిన చెత్తను డంపింగ్ యార్డ్ తరలించి, సిగ్రిగేషన్ చేయాలన్నారు. మురికి కాల్వలు శుభ్ర పరచాలని, మార్చి 31నాటికి 100 శాతం ఇంటి పన్నులు వసూలు చేసి, వసూలు చేసిన పనులను విధిగా ఆన్లైన్ చేయాలని తెలిపారు. నర్సరీ నిర్వహణలో ఎలాంటి లోపం లేకుండా నర్సరీలకు కేటాయించిన లక్ష్యం ప్రకారం 100శాతం మొక్కలు జర్మనేషన్ అయ్యేలా చూడాలన్నారు. ప్రతి నర్సరీలో మొక్కలు ఎండ వేడికి తట్టుకునేలా గ్రీన్ షేడ్ నెట్ లు ఏర్పాటు చేయాలని తెలిపారు. సూచించిన సూచనలు అనుసరించని వారిపై చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ రజియా సుల్తానా, మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలకు కోవిడ్ టీకాను వేయించాలి



**మందమర్రి, మార్చి 16 (అక్షర వెలుగు):** 12సంవత్సరాల పైబడిన పిల్లలకు కోవిడ్ టీకాను వేయించాలని, వాక్సినేషన్ పక్రియ కొనసాగించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ భారతీ హొళికేరి సూచించారు. బుధవారం మందమర్రి పట్టణంలోని పాత బస్టాండ్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ వ్యాక్సినేషన్ దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు 12సంవత్సరాల నుండి 14 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు కోవిడ్ వ్యాక్సినేషన్ అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలో వ్యాక్సినేషన్ కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించడం జరుగుతుంది తెలిపారు. జిల్లాలో కోవిడ్ వ్యాక్సినేషన్ మొదటి,రెండు రోజుల డోసుల లక్ష్యాన్ని పూర్తిస్థాయిలో అధిగమించడం జరిగిందన్నారు. 15 నుండి 17 సంవత్సరాల పిల్లలకు కోవిడ్ వ్యాక్సిన్ అందించడం తో పాటు 60 సంవత్సరాలు పైబడిన వారికి బూస్టర్ డోస్ అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 12 నుండి 14సంవత్సరాల మధ్య గల పిల్లలు 32000మంది ఉన్నారని గుర్తించడం జరిగిందని, వీరందరికీ పూర్తి స్థాయి వ్యాక్సినేషన్ అందించే వరకూ వ్యాక్సినేషన్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూలైజేషన్ అధికారి డాక్టర్ ఫయాజ్, మండల జెడ్పీటీసీ వేల్పుల రవి, మండల ఎంపిపి గుర్రం మంగ గౌడ్, ప్రభుత్వ వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు



**మందమర్రి, మార్చి 16 (అక్షర వెలుగు):** సింగరేణి ఆధ్వర్యంలో మార్చి 8న నిర్వహించాల్సిన మహిళా దినోత్సవ వేడుకలను మం గళవారం సాయంత్రం పట్టణంలోని ఎల్లందు క్లబ్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బెల్లంపల్లి జూని యర్ సివిల్ జడ్జి జి హిమబిందు, బెల్లంపల్లి ఆర్డిఓ శ్యామల దేవి, మందమర్రి ఏరియా సేవా అధ్యక్షు రాలు చింతల లక్ష్మి శ్రీనివాస్, ఏరియా జిఎం చింతల శ్రీనివాస్ లు హాజరై, మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు, తెలిపి, వేడుకలను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి జి హిమబిందు మాట్లాడుతూ, సాధికారత, సమానత్వం దిశగా అడుగులు వేసే మహిళల గురించి ప్రస్తావించే సందర్భం ఇదని, మహిళలు తమకంటూ గుర్తింపు కోసం అహర్నిశలు కృషి చేస్తూనే ఉన్నారని పేర్కొన్నారు. స్వయంశక్తి ద్వారా మహిళలు ఎన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. బెల్లంపల్లి ఆర్డీవో శ్యామల దేవి మాట్లాడుతూ, ఎందరో భారతీయ మహిళలు నేడు సమాజంలో విలువలతో రాణిస్తున్నారని, విభిన్న రంగాల్లో కృషి చేస్తూ ఎన్నో అద్భుత విజయాలను సొంతం చేసుకొంటున్నారని, ఇది ఆయా రంగాల్లో ఆశతో అడుగుల వేసే మహిళలకు స్ఫూర్తి కావాలన్నారు. సింగరేణి సంస్థ మహిళల విషయంలో సింగరేణి సేవా సమితి ద్వారా ఎన్నో మంచి కార్యక్రమాలు చేపడుతూ, వారికి ఉపాధి కల్పిస్తుందని కొనియాడారు. సింగరేణి సేవాసమితి ఏరియా అధ్యక్షురాలు చింతల లక్ష్మి శ్రీనివాస్ మాట్లాడుతూ, అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు విచ్చేసిన మహిళందరిని అభినందించారు. ఇదేవిధంగా ప్రతి కార్యక్రమంలో ముందు ఉండాలని కోరారు. సింగరేణి యాజమాన్యం మహిళలు వారి సొంత కాళ్ళ మీద నిలబడాలి ఉద్దేశంతోనే మహిళలకు సింగరేణి సేవా సమితి ద్వారా టైలరింగ్, బ్యూటిషన్, ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం వర్క్, కోర్సులలో శిక్షణ ఇస్తుందని తెలిపారు. అనంతరం న్యూఢిల్లీకి చెందిన షేక్ షిక్ భారత్ ఆగజ్ ఆర్గనైజేషన్, శాంతి ఫౌండేషన్, ఇండియా స్వదేశీ ఇన్స్టిట్యూట్ ఆద్వర్యంలో ఉత్తమ మహిళా, ఉత్తమ సేవా అవార్డులను సింగరేణి సేవా సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న చింతల లక్ష్మి శ్రీనివాస్ కు, అదేవిధంగా కరోనా నివారణకు చేసిన సేవలకు గాను సింగరేణి రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రి డివైసిఎంఓ ఎం ఉష లకు ఉత్తమ మహిళ, ఉత్తమ సేవ అవార్డులను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్ వరప్రసాద్, సీనియర్ పిఓ మైత్రేయ బందు, మహిళలు, సింగరేణి లేడీస్ క్లబ్ సభ్యులు, సేవాసమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సమ్మె నోటీసు అందజేసిన సిఐటియు నాయకులు



**మందమర్రి, మార్చి 16 (అక్షర వెలుగు):** సింగరేణి సంస్థ మందమర్రి లోని కేకే గనిలో బుధవారం గని ఎస్ఓఎం భూశంకరయ్య కు సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నాయకులు దేశ వ్యాప్త సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ మందమర్రి బ్రాంచ్ అధ్యక్షులు ఎస్ వెంకటస్వామి మాట్లాడుతూ, దేశ వ్యాప్త సమ్మె లో భాగంగా బొగ్గు బావులు ప్రైవేటీకరణను విరమించుకోవాలని డిమాండ్ తో పాటు సింగరేణి కార్మికుల అపరిష్కృత సమస్యలైన అలవెన్సులు పై ఐటీ మాఫీ చేయాలని, కార్మికులు దిగిపోయినప్పుడు ఎవరి క్వార్టర్ వారికే కేటాయించి, కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయాలని, 11వ వేతన ఒప్పందం త్వరగా పరిష్కరించాలని, ప్రమాదంలో మృతి చెందిన శాశ్వత, కాంట్రాక్ట్ కార్మికులకు కోటి రూపాయలు నష్టపరిహారం అందజేయాలని డిమాండ్లతో సమ్మె నోటీసు అందజేయడం జరిగిందని తెలిపారు. అనంతరం కార్మికులకు సమ్మె కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గని ఫిట్ నాయకులు జె ప్రవీణ్, సంజీవ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై కాజా నజిరుద్దీన్



**భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 16 (అక్షర వెలుగు):** భద్రాద్రి జిల్లా బూర్గంపహడ్ మండల పరిధిలోని సారపాక గ్రామంలో ఎస్.ఐ సముద్రాల జితేందర్ ఆదేశానుసారం అదనపు ఎస్.ఐ కాజా నజిరుద్దీన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు,పలు అంశాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు.వాహన సంబంధిత పత్రాలు కచ్చితంగా కలిగి ఉండాలని వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిగే అనార్ధాల గురించి వివరించారు,ముఖ్యంగా ద్విచక్ర వాహన దారులు హెల్మెంట్ ధరించి వాహనాలు నడపాలని,అదే విధంగా అతి వేగం వద్దు నినాధమే ముద్దు అని ఆయన తెలిపారు.వాహనదారులు తమ వాహనాల పై ఉన్న ఇ-చలాన్ పెండింగ్ కేసుల పై ప్రభుత్వం రాయితీ కల్పించిందని అట్టి పెండింగ్ లు ఆన్ లైన్లో చెల్లించుకోవాలని అవగాహన కల్పించారు.ఈ క్రమంలో ఎస్.ఐ కాజా నజిరుద్దీన్ తో పాటు కానిస్టేబుల్ వీరబాబు వాహన దారులు పాల్గొన్నారు.

## యువత అసాంఘిక కార్యక్రమాలకు, చెడు అలవాట్లకు బానిసకావద్దు : ఎస్ఐ కాజా సూచనలు



**భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 16 (అక్షర వెలుగు):** భద్రాద్రి జిల్లా బూర్గంపహడ్ మండల పరిధిలోన కోయగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో ఎస్.ఐ సముద్రాల జితేందర్ ఆదేశానుసారం అదనపు ఎస్.ఐ కాజా నజిరుద్దీన్ ఆధ్వర్యంలో ప్రగతి ట్రాన్స్పోర్ట్ క్యాంప్ వాసులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.పలు అంశాలపై వారికి అవగాహన కల్పించారు ముఖ్యంగా యువత మరియు క్యాంప్ వాసులు అసాంఘిక కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల జరిగే అనర్ధల గురించి వివరించారు.చెడు అలవాట్లకు ముఖ్యంగా గంజాయి,మద్యం,గుట్కాలకు బానిసలుగా మారి కుటుంబాలకు దూరం కావద్దని దీంతో ఆరోగ్యం పూర్తిగా దెబ్బ తిని మూల పడే అవకాశాలు మెండుగా ఉంటాయి అని మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల మన ప్రాణమే కాక ఎదుటి వాహన దారులకు కూడా ప్రాణ హాని పొంచి ఉంటుందని తెలిపారు.ముఖ్యంగా ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెంట్ లు ధరించి నడపాలని అదే విధంగా పెండింగ్ చలానాలను ప్రభుత్వం కల్పించిన రాయితి లో కట్టుకుంటే కలిగే ప్రయోజనం గురించి వివరించారు.పరుగు రాష్ట్రల నుండి జీవనం సాగించేందుకు వచ్చిన కుటుంబాలు వాహన ప్రయాణం చేసేప్పుడు జాగ్రత్తలు పాటించాలని ఎక్కువ మొత్తంలో ట్రాలి వాహనంలో ప్రయాణం చేయవద్దని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్.ఐ తో పాటు కనిస్టేబుల్ వీరబాబు అదేవిధంగా క్యాంప్ వాసులు పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ శ్రీ పద్మమ్మ యోగిని గారి ద్వాదశ వార్షిక మహోత్సవ ఆహ్వానము

**దోమ, మార్చి 16 (అక్షర వెలుగు):** గొడుగొనిపల్లీ గ్రామంలో శ్రీ శ్రీ పద్మ యోగిని గారి ద్వాదశ వార్షిక మహోత్సవ కార్యక్రమాలు రెండు రోజుల పాటు 20-03-2022 ఉదయం నుండి 21-03-2022 సాయంత్రం వరకు ఈ కార్యక్రమాలు శ్రీ శ్రీ నాగ మూర్తి స్వామి మరియు మానేమ్మ అమ్మ గారి ఆధ్వర్యంలో జరుగుతున్నవి. వీరాంజనేయ స్వామి చందన అలంకారం పూజ, రుద్రాభిషేకం, నైవేద్యం, మంగళ హారతి భగవద్గీత హనుమాన్ చాలీసా పారాయణం తదుపరి అమ్మవారి ఊరేగింపు అనంతరం భోజన కార్యక్రమం ఉంటుంది అని శ్రీ శ్రీ నాగ మూర్తి స్వామి గారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల భజనబృందాలు కూడా పాల్గొంటాయి అని ఆయన తెలియజేశారు. మరియు ఈ కార్యక్రమంలో గ్రామస్థులు ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని మాజీ సర్పంచ్ జాలరి నర్సింహులు గుజ్జ రాజశేఖర్ రెడ్డి మరియు వార్డు మెంబర్ చేక్కలి గోపాల్ యువజన సంఘం నాయకుడు రవి కుమార్ రమేష్ శ్రీశైలం నరేష్ తదితరులు పేర్కొన్నారు.

## ఉద్యోగంలోకి తీసుకున్నందుకు ధన్యవాదాలు తెలుపుతున్న ఫీల్డ్ అసిస్టెంట్



**ములుగు, మార్చి 16 (అక్షర వెలుగు):** గోవిందరావుపేట మండల కేంద్రంలోని గోవిందరావుపేట లో ఫీల్డ్ అసిస్టెంట్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆన్ రెడ్డి సమ్మయ్య అధ్యక్షతన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు గారికి తిరిగి ఉద్యోగంలోకి తీసుకున్నందుకు కృతజ్ఞతలు తెలుపుతూ మండల ఫీల్డ్ అసిస్టెంట్లు అందరు కూడా కృతజ్ఞతా భావంతో ని కెసిఆర్ గారి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించడం జరిగింది

## కోమటిరెడ్డి బ్రదర్స్ పార్టీ మారే ప్రసక్తే లేదు, కచరా మాటలు నమ్మవద్దు: ఆర్ కే ప్రవీణ్



**ఇబ్రహీంపట్నం, మార్చి 16 (అక్షర వెలుగు):** కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి త్వరలో వేరే పార్టీలో చేరబోతున్నారని సోషల్ మీడియాలో వచ్చిన విషయాలను ఎవరూ నమ్మవద్దని ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కోమటి రెడ్డి వర్గం యూత్ కాంగ్రెస్ సభ్యులు ఆర్ కే ప్రవీణ్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీలో ఎవరికీ లేని జనాదరణ కోమటిరెడ్డి బ్రదర్స్ కు దక్కుతుందని తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ నుండి పోటీ చేసి అయినా సరే గెలిచే గల సత్తా కోమటిరెడ్డి బ్రదర్స్ కి ఉందని, సోషల్ మీడియాలో వచ్చే అబద్ధపు మాటలను ఎవరూ నమ్మవద్దని ఇలాంటి బూటక పోస్టర్స్ సెట్ చేసే వారిని చట్టానికి అప్పగిస్తామని ,కోమటిరెడ్డి బ్రదర్స్ కి వాళ్ల రక్తంలోనే కాంగ్రెస్ పార్టీ ఉన్నదని మరొక్కసారి కాంగ్రెస్ కార్యకర్తలకు గుర్తు చేస్తున్నాను అని ఆయన కాంగ్రెస్ లోనే కొనసాగి వచ్చే ఎన్నికలలో తప్పనిసరిగా కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి చేయడమే వాళ్ళ లక్ష్యమని తెలిపారు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **GPR PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
TITLE CODE.TELTEL02057, Cell:8464816456 Email: aksharavelugudaily@gmail.com, Website: www.aksharavelugu.com